ప్రజాశక్తి

మంగళవారం 10 అక్టోబర్ 2023 8 పేజీలు





గుంటూరు పల్నాడు

ఎండమావిగా డిఎస్‌సి

- నాలుగేళ్లలో విడుదల కాని నోటిఫికేషన్
- జిల్లాలో 1200 ఉపాధ్యాయుల ఖాళీలు
- ప్రభుత్వ రికార్డుల్లో 507 మంది మాత్రమే అవసరం
- జిల్లాలో 40 వేల మంది నిరుద్యోగుల ఎదురుచూపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ (డిఎస్‌సి) నాలుగున్నరేళ్లుగా నిలిచి పోయింది. ప్రతి ఏటా డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేస్తామని వైసిపి తన మేనిఫెస్టోలో పేర్కొంది. సిఎం జగన్ పాదయాత్రలో నిరుద్యోగులకు హామీ ఇచ్చారు. ఇదే అంశాన్ని మేనిఫెస్టోలో ఉంచినా గత నాలుగేళ్లలో ఒక్కసారి కూడా డిఎస్‌సి పోస్టుల భర్తీకి నోటిఫకేషన్ విడుదల చేయలేదు. ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1200 వరకు టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దాదాపు 40 వేల మంది శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు.

పాఠశాలల విలీనం తర్వాత ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఏర్పడింది. ప్రాథమిక పాఠశాలలో బిఇడి చేసిన ఎస్‌జిటి ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలలకు సర్దుబాటు చేయడం వల్ల ప్రాథమిక పాఠశాలల్లో పెద్దఎత్తున ఖాళీలు ఏర్పడుతున్నాయి. ఒకరు లేదా ఇద్దరు ఉపాధ్యాయులతో చాలా ప్రాథమిక పాఠశాలలు కొనసాగుతున్నాయి. ప్రధానంగా పల్నాడు జిల్లాలో ఉపాధ్యాయుల కొరత ఎక్కువగా ఉంది. సబ్జెక్టు టీచర్ల కొరతతో విద్యార్థులు అల్లాడుతున్నారు. కొంతమందిని పల్నాడు జిల్లాలోని పాఠశాలలకు పంపినా వారిలో కొంత రాజకీయ నాయకుల సిఫార్సులతో మళ్లీ గుంటూరు పరిసరాల్లో పనిచేయడానికి ఉత్తర్వులు తెచ్చుకుంటున్నారు.

తాడేపల్లి కేంద్రంగా అక్రమ బదిలీలకు జోరుగా పైరవీలు జరుగుతున్నాయి. కొంతమంది ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయులకు సిఫార్సులేఖలు ఇప్పిస్తామని భారీ ఎత్తున ముడుపులు తీసుకుంటున్నారనే ఆరోపణలూ వున్నాయి. ప్రమోషన్ల నిలిచిపోవడం వల్ల కూడా సబ్జెక్టు టీచర్ల కొరత వెంటాడుతోంది. ఎయిడెడ్ పాఠశాలలు అన్‌ఎయిడెడ్‌గా మారిన నేపథ్యంలో 240 మంది ప్రభుత్వంలో వివిధ యాజమాన్యాల పాఠశాలల్లో సర్దుబాటు చేసినా ఇంకా కొరత వెంటాడుతోంది. జిల్లాలో 1200 మంది ఉపాధ్యాయులను డిఎస్‌సి ద్వారా నియమించాల్సి ఉందని ఉపాధ్యాయ సంఘాలు చెబుతుండగా ప్రభుత్వం 507 మందే అవసరమని అంటోంది. జిల్లా వ్యాప్తంగా బిఇడి, డిఇడి, పండిట్స్ శిక్షణ పూర్తిచేసుకున్న దాదాపు 40వేల మంది ఉపాధ్యాయ పోస్టుల కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు ఇప్పటికే పనిచేస్తున్న ఉపాధ్యాయులు అదనపు బాధ్యతలతో అవస్థ పడుతున్నారు.

25 వేల పోస్టులకు డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలి

ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు



రాష్ట్రంలో ప్రస్తుతం 20-25 వేల ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీలుండగా ప్రభుత్వం కేవలం 8,366 ఖాళీలను చూపడం సరికాదు. ఇప్పటికే చాలా పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల మంది నిరుద్యోగులు డిఎస్‌సి కోసం ఎదురు చూస్తున్నారు. పల్నాడులో సిఫార్సులతో సర్కారు బదిలీలకు అనుమతించడం వల్ల ఉపాధ్యాయుల కొరతతో పేద విద్యార్థులు నష్టపోతున్నారు.

విద్యా వ్యవస్థ అస్తవ్యస్తం

యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్



నూతన విద్యా విధానం అమలుకు చూపిస్తున్న ఉత్సాహం పాఠశాలల్లో ఖాళీల భర్తీకి ప్రభుత్వం చూపడం లేదు. మేనిఫెస్టోలో 98.5 శాతం అమలు చేశామని చెబుతున్న ముఖ్యమంత్రి డిఎస్‌సి ద్వారా నియామకాలు ఎందుకు చేపట్టలేదు. ఉపాధ్యాయులకు పనిభారం పెరిగింది. నాడు-నేడు పాఠశాలలను రంగులతో తిర్చిదిద్దినా చదువు చెప్పేందుకు ఉపాధ్యాయులు ఉండాలి కదా?



విలేకర్లతో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

కౌల్దారును ఆదుకోకుంటే రాష్ట్రం అధోగతే

- అన్ని విధాలా అన్యాయానికి గురవుతున్న కౌలురైతులు
- కృష్ణా జలాలపై తెలంగాణలో లబ్ధి కోసమే కేంద్రం గెజిట్
- రాష్ట్ర ప్రభుత్వం లేఖతో సరిపెడితే సరిపోదు
- అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి పోరాడాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - సత్తెనపల్లి

రాష్ట్రంలో మొత్తం వ్యవసాయ భూమిలో 80 శాతం సాగుచేస్తున్న కౌల్దార్లకు రక్షణ కల్పించకుంటే రాష్ట్రమే కుదేలవుతుందని ఆకలి ఆంధ్రపదేశ్‌గా మారుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. సత్తెనపల్లికి సోమవారం వచ్చిన ఆయన స్థానిక పుతుంబాక భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో మొత్తం 30 లక్షల మంది కౌలు రైతులుండగా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఐదు లక్షల మందికే గుర్తింపు కార్డులిచ్చిందని, వీటిల్లో కొంతమంది తప్పుడు పద్ధతుల్లో కార్డులు పొందారని తెలిపారు. యజమాని తన బంధువుల పేర్లతోనే కార్డులు పొందుతున్నారని అన్నారు. ఈ క్రమంలో వాస్తవ సాగుదార్లు కార్డులు, రుణాలు, సబ్సిడీలు అందక అన్యాయానికి గురవుతున్నారని చెప్పారు. మరోవైపు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టిన కౌలురైతులు ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు నష్టాల పాలవుతున్నారని, పంటను రైతు భరోసా కేంద్రాల్లో అమ్ముకునేందుకు అర్హత లేకపోవడంతో బయట మార్కెట్లో దళారులకే తక్కువ ధరకు అమ్ముకుంటున్నారని ఆవేదన వెలిబుచ్చారు.

ఈ ఏడాది వరి సాగు 25 లక్షల ఎకరాల్లో తగ్గిందని, నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాల నుండి నీటి సరఫరా లేక పల్నాడు ప్రకాశం, కర్నూలు జిల్లాల్లో పంటలెండిపోతున్నాయని చెప్పారు. వరికపూడిశెల ప్రాజెక్టు

2లో

అంగన్‌వాడీలకు ఎఫ్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘాల నాయకులు

సమస్యలపై కమిషనర్‌తో చర్చించిన సంఘాలు

ప్రజాశక్తి-గుంటూరు

అంగన్‌వాడీలకు ఫేస్ రికగ్నైజేషన్ యాప్ రద్దు చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని ఎపి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు), ఎఐటియుసి, ఐఎఫ్‌టియు అనుబంధ సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక మహిళా ప్రాంగణంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్ జానకితో ఆయా సంఘాల నాయకులు చర్చించారు. అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, అధ్యక్షులు జి.బేబీరాణి, ఎఐటియుసి నాయకులు, లలితమ్మ, ప్రేమ, ఐఎఫ్‌టియు నాయకులు జ్యోతిరాణి, భారతి పాల్గొని అంగన్‌వాడీల సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్ అంగన్వాడీలకు చాలా ఇబ్బందిగా ఉందని, సిగ్నల్స్ ఉండట్లేదని ప్రీస్కూల్ సక్రమంగా జరగట్లేదని, లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారని, పదేపదే సెంటర్ చుట్టూ తిరగాల్సి వస్తోందని, దీన్ని రద్దు చేయాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని,

2లో



పేదల ఇళ్లు నేలమట్టం

- కళ్యాణ మండపం నిర్మాణం కోసమంటూ సంత్రం స్థలంలో ఇళ్లను కూల్చేయించిన దేవాదాయ శాఖాధికారులు
- నోటీసులు, స్థలాలు ఇచ్చామంటున్న అధికారులు
- తమకేమీ ఇవ్వలేదంటున్న పేదలు

2లో



మంగళగిరి మండలం కాజలో మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

25 వేల ఎకరాలకు అందని నీరు

- హైలెవల్ ఛానల్ పనులు పూర్తయినా విద్యుత్ కనెక్షన్ ఇవ్వకే ఇబ్బందులు
- ఇళ్ల పట్టాలివ్వకపోగా ఖాళీ చేయాలని నోటీసులు
- సిపిఎం పాదయాత్ర బృందం ఎదుట ప్రజల ఆవేదన

2లో

25 వేల ఎకరాలకు అందని నీరు



దుగ్గిరాల మండలంలో పాదయాత్ర బృందానికి వినతిపత్రం ఇస్తున్న మహిళలు

ప్రజాశక్తి - దుగ్గిరాల

హైలెవెల్ ఛానల్ కింద పొలాలకు వెంటనే సాగునీరిచ్చి పంటలను కాపాడాలని ప్రభుత్వాన్ని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. మంగళగిరి నియోజకవర్గంలో ఆ పార్టీ చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర 7వ రోజుకు చేరింది. దుగ్గిరాల మండలంలోని మంచికలపూడిలో సోమవారం పాదయాత్ర ప్రారంభం కాగా తుమ్మపూడి, చిలువూరు, మంగళగిరి మండలం కాజలో జరిగింది. రాత్రికి మంగళగిరి పట్టణానికి చేరింది. ఆయా ప్రాంతాల్లో పాదయాత్రకు ఘన స్వాగతం పలికిన ప్రజలు తమ సమస్యలను బృందానికి విన్నవించారు. చిలువూరులో రైతులు పాదయాత్ర బృందాన్ని కలిసి తమ పొలాలకు నీరందం లేదని అర్జీనిచ్చారు. హైలెవల్ చానల్ కింద పొలాలకు నీరు సరఫరా చేయడం లేదని అర్జీలో పేర్కొన్నారు. పెదవడ్లపూడి వద్ద బకింగ్‌హాం కాల్వ ఆధునికీకరణ పనులు గత ప్రభుత్వ హయాంలో చేపట్టినా ఇప్పటికీ కొలిక్కి రాలేదని, ఫలితంగా ఈ ప్రాంతంలో పొలాలకు నీరు అందక ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. తమకు గ్రామంలోనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని మరికొంతమంది విన్నవించారు. తమకు కుల ధ్రువపత్రాలు ఇవ్వడం లేదని తుమ్మపూడికి చెందిన ఎస్టీలు వాపోయారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

అనంతరం కాజ గ్రామానికి చేరిన పాదయాత్రకు స్థానికులు బ్రహ్మరథం పట్టారు. వాటర్ ట్యాంక్ నుండి పూల వర్షంతో గ్రామంలోకి ఆహ్వానించారు. తొలుత గ్రామ శివారు పొలాల్లోని కూలీలు, రైతులను పాదయాత్ర బృందం కలిసి వారి సమస్యలను తెలుసుకుంది. సాగునీరు సరిగా విడుదల చేయకపోవడం, వర్షాల ఆలస్యం, విత్తన సమయం లోనూ సరైన వర్షాల్లేకపోవడం తదితర కారణాలతో పొలం బెట్టకొచ్చి విత్తనాలు మొలవడం లేదని రైతులు వాపోయారు. రామారావు మాట్లాడుతూ హై లెవెల్ ఛానల్ పనులు పూర్తయినా విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదన్నారు. ఫలితంగా ఐదు మండలాలకు చెందిన సుమారు 25 వేల ఎకరాల్లో సాగు ఇబ్బందుల్లో పడిందన్నారు. గ్రామంలో ఎన్నో ఏళ్ల కిందట ఇళ్లేసుకుని నివాసం ఉంటున్న వారికి పట్టాలివ్వకపోగా ఖాళీ చేయాలంటూ అధికారులు భయాందోళనకు గురి చేస్తున్నారని, ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల ఇళ్లను క్రమబద్ధీకరించడంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా కాజా అండర్ పాస్ వద్ద కొద్దిపాటి వర్షానికే నీరు నిలిచి ఇబ్బందిగా ఉందని, అధికారులు పట్టించుకోవడం లేదని, నంబూరు వెళ్లే రోడ్డు భారీ వాహనాల రాకతో గుంతల మయంగా మారి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, పుల్లయ్య నగర్, ఇతర కాలనీల్లో ఇళ్ల పట్టాల సమస్య తీవ్రంగా ఉందని, పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా ఇప్పటికీ ఫలితం దక్కలేదని పాదయాత్ర బృందానికి స్థానికులు వినతిపత్రాలిచ్చారు. తర్వాత పాదయాత్ర చినకాకానిలో పర్యటించింది. అనంతరం మంగళగిరి పట్టణంలోకి ప్రవేశించిన పాదయాత్రకు బైపాస్ రోడ్డులోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి కాలనీ ఘన స్వాగతం లభించింది. పూల వర్షంతో బృందాన్ని పట్టణంలోకి ఆహ్వానించారు.

కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇ.అప్పారావు, ఎం.రవి, ఎస్ఎస్.చెంగయ్య, సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పి.బాలకృష్ణ, నాయకులు బి.శ్రీనివాసరావు, ఎం.శివసామి రెడ్డి, జె.బాలరాజు ఎం.నాగమల్లేశ్వరరావు, ఎం.నరసింహా రావు, జి.యోహాను, చిరంజీవి, కె.బిక్షాలు, కె.ప్రభాకర్ రావు, మురళి, వి.నాగేశ్వరావు, ఎం.బాగ్యరాజు, జి.నాగేశ్వర రావు, డి.శ్రీను, క్రాంతి, రాజముని, కె.కరుణాకర్, ఇ.ప్రతాపరెడ్డి, ఎ.సాంబిరెడ్డి, బి.కోటేశ్వరి, ఎస్.ఆదిశేఖర్, ఎస్.సుమ, ఎస్.నిర్మల, వి.అనసూయ, సత్యమారెడ్డి, గోపాలరెడ్డి, లక్ష్మారెడ్డి, ఎం.సామిరెడ్డి, వై.కమలాకర్, ఎం.బాలాజీ, ఎం.చలపతిరావు, కె.వెంకటేశ్వరరావు, జి.దుర్గాప్రసాద్, జె.శివభావన్నారా యణ పాల్గొన్నారు.



మంగళగిరి మండలం కాజ గ్రామంలో పాదయాత్ర



మంగళగిరి పట్టణంలో పాదయాత్రకు ఘన స్వాగతం

కౌల్దారును ఆదుకోకుంటే రాష్ట్రం అధోగతే

(మొదటి పేజీ తరువాయి)

పూర్తయితే లక్ష ఎకరాలు సాగు నీరు అందుతుందని చెప్పారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కృష్ణాజలాలను మొత్తాన్ని కేంద్రానికి తాకట్టు పెట్టిందని, తెలంగాణ ఎన్నికల్లో లబ్ధికోసం కృష్ణా జలాల పంపిణీపై కేంద్రం గెజిట్‌ను ఇచ్చిందని విమర్శించారు. ఇది చట్ట విరుద్ధమన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంటుందని, ఒక లేఖ రాసి ఊరుకుంటే పరిపోతుందా? అని ప్రశ్నించారు. మోడీ అడుగులకు మడుగులొత్తుతుంటే న్యాయం జరగదని, గట్టిగా పోరాడాలని అన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలపై మాట్లాడకపోగా చివరకు కృష్ణా జలాలను, వ్యవసాయాన్ని, రైతుల ప్రయోజనాలను కేంద్రంలో తాకట్టు పెట్టడం దారుణమన్నారు. కృష్ణా జలాలను వదులుకుంటే నాగార్జునసాగర్, శ్రీశైలం ఎండిపోతాయని అన్నారు. ఇప్పటికే కర్ణాటక ప్రాజెక్టులు కట్టుకుంటుందని, దీంతో తుంగభద్ర ఎండిపోతే కేసీ కెనాల్ ఎండిపోతుందని హెచ్చరించారు. బచావత్ ట్రిబ్యునల్ అమలులో ఉందని, దాని ప్రకారం కృష్ణా జలాలపై, మిగులు జలాలపైన మనకు హక్కుందని గుర్తు చేశారు. పోలవరం పూర్తయి ఉంటే ఆ జలాలను కృష్ణా నదికి మళ్లించేవారమన్నారు. రూ.100 కోట్లు, ఆ పైబడిన పెద్దపెద్ద కాంట్రాక్టర్లపైన ఉన్న శ్రద్ధ చిన్న కాంట్రాక్టర్లపైన, సర్పంచులకు బిల్లును చెల్లించడంపైన, పునరావాసం కల్పించడంపై రాష్ట్ర ప్రభుత్వానికి లేదని విమర్శించారు. అవసరమైతే అఖిలపక్ష సమావేశం వేసి ఆ బృందాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి గెజిట్‌ను ఉపసంహరించుకునే వరకు ఆందోళన చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. లేకుంటే ప్రజా కోర్టులో సిఎం జగన్మోహన్‌రెడ్డి దోషిగా నిలబడాల్సి వస్తుందని హెచ్చరించారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ నాగార్జునసాగర్ నీళ్లు వదలక పోవడం వల్ల వరి పంట వేయలేదని, ఇప్పటికే వేసిన పంటల్లో మిర్చికి నీటి అవసరం చాలా ఉందని అన్నారు. ఆరు తడులకు నీరిస్తామని మంత్రి అంబటి రాంబాబు చెబుతున్నా ఇప్పుడు సాగర్, శ్రీశైలం జలాశయాల్లో నీరు లేకుండా ఎలా ఇవ్వాలంటున్నారని, చిత్తశుద్ధి ఉంటే అనేక మార్గాలున్నాయని అన్నారు. నీరు సరఫరా చేయకుంటే రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రభుత్వం దగ్గర ప్రణాళిక లేదని విమర్శించారు. ప్రత్యామ్నాయ పంటలుగా అపరాలు సాగు చేస్తే తప్ప ఇప్పటికే వెనుకబడి ఉన్న ఈ పల్నాడు జిల్లా ఇంకా వెనుకబడే ప్రమాదం ఉందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని మొత్తం భూమి మొత్తం సాగులోకి వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, విత్తనాలను రైతులకు అందుబాటులోకి తేవాలని కోరారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, మండల కార్యదర్శి పి.మహేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ కంటే రూ.వెయ్యి అదనంగా ఇస్తామన్న సిఎం హామీ అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, పెన్షన్ ఇవ్వాలని, హెల్పర్ల ప్రమోషన్లలో రాజకీయ జోక్యం నివారించాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్, అంగన్వాడీ కేంద్రాలకు నాణ్యమైన ఫీడింగ్ ఇవ్వాలని, మే నెల మొత్తం పాఠశాలల మాదిరిగా అంగన్‌వాడీ కేంద్రాలకూ వేసవి సెలవులు ఇవ్వాలని కోరారు. డ్యూటీలో ఉండి చనిపోయిన వారికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. రకరకాల యాప్‌లు రద్దు చేసి, ఒకే యాప్ ఉంచాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా చేయాలని, 2017 నుండి పెండింగ్‌లో ఉన్న టిఎలు, ఇతర బిల్లులు, కరోనా కాలంలో 10 శాతం కట్ చేసిన వేతనం, ఛార్జి అలవెన్స్ ఇవ్వాలన్నారు. సూపర్వైజర్ పోస్టులు పెండింగ్‌లో ఉన్న సెకండ్ లిస్టు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు మీటింగ్‌లు వర్కర్లకు ప్రతినెలా, హెల్పర్లకు మూడు నెలలకు ఒకసారి నిర్వహించాలన్నారు. రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, యూనిఫామ్ తదితర సమస్యలను కమిషనర్‌కు వివరించారు. ఆయా సమస్యలపై కమిషనర్ సానుకూలంగా స్పందించారు. తన పరిధిలో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో మార్పులు చేస్తామని హామీ ఇచ్చారు. ఒకే యాప్ విధానం, ఇతర తన పరిధిలో ఉన్న సమస్యలను ఈ నెలఖరులోగా పరిష్కరిస్తామని, జిల్లా స్థాయిలో సమస్యల పరిష్కారానికి జాయింట్ మీటింగ్‌లు నిర్వహించేలా పీడీలతో మాట్లాడతామని అన్నారు. వేతనాలు పెంపు, గ్రాట్యూటీ తదితర సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. చర్చల్లో వాణిశ్రీ, షకీలా, సుప్రజ, దీప్తి మనోజ, శ్రీదేవి, చంద్రావతి, అన్ని జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.



కొత్తపేట సిఐకు సత్కారం

ప్రజాశక్తి-గుంటూరు సిటి

కొత్తపేట సిఐ షేక్ అన్వర్ బాషాను ముస్లిం పెద్దలు నారీ సామాన్ ఆర్గనైజేషన్ కు చెందిన షేక్ సలీం, షేక్ పై రోజ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. గవర్నమెంట్ హాస్పిటల్‌లో 8 నెలల పాప కిడ్నాప్ కేసు విషయంలో వెంటనే స్పందించి 24 గంటల్లోనే రక్షించి పసిపాప తల్లిదండ్రులకు అప్పగించినందుకు గాను కొత్తపేట సీఐ ను పాప తల్లిదండ్రుల సమక్షంలో కలిశారు.

మద్యం మత్తులో దాడి

ప్రజాశక్తి-గుంటూరు సిటీ: మద్యం మత్తులో యువకుడి పై దాడి చేసిన ఘటన పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది . ఎస్సై లోకనాథ్ తెలిపిన వివరాల ప్రకారం కోబాల్ట్‌పేటకు చెందిన మల్ల దిలీప్ రాజా సోమవారం ఉదయం చెత్త పడేసేందుకు బయటకు రాగా వరుసకు బాబాయ్ అయ్యే ఉరుసుమల్లు రాజశేఖర్ మద్యం మత్తులో వెనక నుండి వచ్చి దాడి చేశాడు. దాడిలో దిలీప్ రాజుకు తలకు గాయం కావడంతో స్థానికులు జిజిహెచ్ కు తరలించారు. ఈ ఘటనపై దిలీప్ రాజు ఇచ్చిన ఫిర్యాదుతో పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు



పేదల ఇళ్లు నేలమట్టం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పట్టణంలోని 22 వార్డులోని శ్రీ అవ్వారు ఆదెమ్మ సత్రానికి ఎందిన స్థలంలో 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న ఆరు కుటుంబాలకు చెందిన ఇళ్లను గుంటూరు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం తొలగించారు. బాధితులు అడ్డుకునే ప్రయత్నం చేసినా అప్పటికే మోహరించిన పోలీసులు వారిని పక్కకు నెట్టేయడంతో పొక్లెయినర్లు వచ్చి ఇళ్లను నేలమట్టం చేశాయి. ఈ ప్రదేశంలో కళ్యాణ మండపం నిర్మించాల్సి ఉందని, ఇళ్లు తొలగించాలని నివాసితులకు గతనెల 8న నోటీసులు జారీ చేశామని అధికారులు చెబుతున్నారు. ఇళ్ల తొలగింపు సమాచారం తెసుకున్న మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అక్కడికి చేరుకుని మహేష్‌రెడ్డిని నిలదీశారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఇళ్లను ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. నోటీసులు ఇచ్చామని, కోర్టు ఆదేశాల మేరకే ఇళ్లను తొలగిస్తున్నామని చెప్పిన అసిస్టెంట్ కమిషనర్ అక్కడి నుండి వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా కారును అడ్డగించారు. నరేంద్రకుమార్‌ను పోలీసులు పక్కకు లాగేసి అసిస్టెంట్ కమిషనర్‌ను అక్కడి నుండి పంపించారు. దీంతో నరేంద్రకుమార్ అక్కడే ఉన్న సంత్రం ఈఓ కె.భవానీ ప్రసాద్‌ను నిలదీశారు. ముందుస్తు నోటీసులను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కొంతసేపు వాగ్వాదం జరిగింది. మరోవైపు తమకు అధికారులు అన్యాయం చేస్తున్నారని, తమకు నోటీసులేమీ ఇవ్వలేదని నరేంద్రకుమార్ ఎదుట బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. ఇళ్ల తొలగింపు సందర్భంగా బయట పడేసిన సామాన్లను నరేంద్ర ఆధ్వర్యంలో సత్రం గదుల తాళాలు పగలగొట్టి వాటిల్లో పెట్టారు. తమకు జగనన్న కాలనీల్లో స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించాలని, అప్పటి వరకూ సత్రం స్థలంలోనే తలదాచుకుంటామని బాధితులు చెప్పారు. అయితే వీరికి జగనన్న కాలనీల్లో ఇళ్లు కేటాయించినట్లు ఇఓ చెబుతుండగా కళ్యాణ మండపం నిర్మాణం అనంతరం వచ్చే ఆదాయం ద్వారా ప్రతిరోజూ 100 మంది పేదలకు అన్నదానానికి నిర్ణయించామని, ప్రభుత్వం, ఎమ్మెల్యే సహకారంతో దేవదాయ శాఖ నిధులతో నిర్మాణం చేపడగామని సంత్రం ఫౌండర్ ట్రస్టీ అవ్వారు వెంకటేశ్వరరావు అన్నారు.

సత్తెనపల్లి నియోజకవర్గ అభివృద్ధికి చర్యలేవి?

పరిశ్రమలను నెలకొల్పి ఉపాధి కల్పించాలి


పట్టణాల్లోనూ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలి

భవన నిర్మాణ రంగంలో పెండింగ్‌లో ఉన్న 700 క్లైములను పరిష్కరించాలి

సిపిఎం సత్తెనపల్లి నియోజకవర్గ విస్తృత సమావేశంలో రాష్ట్ర నాయకులు వి.కృష్ణయ్య

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి నియోజకవర్గం అభివృద్ధికి చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి కృష్ణయ్య అన్నారు. సోమవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నాయకులు ధరణికోట విమల అధ్యక్షత సిపిఎం సత్తెనపల్లి నియోజకవర్గ విస్తృత సమావేశంలో కృష్ణయ్య ప్రసంగించారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో ఉపాధి కోల్పోయిన నిరుద్యోగులు రోజురోజుకు పెరుగుతున్నారని అన్నారు. నియోజక వర్గంలో సరైన పరిశ్రమలు లేవని ఉన్న పరిశ్రమలలో స్థానికులకు పనులు కల్పించడం లేదని అన్నారు. భవన నిర్మాణ రంగంలో సంక్షేమ బోర్డు నిధులను ముఖ్యమంత్రి ఇతర మార్గాలకు మళ్లించడంతో సత్తెనపల్లి నియోజకవర్గంలో 700 క్లైములు పెండింగ్లో ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దారి మళ్లించిన నిధులను తిరిగి సంక్షేమ బోర్డుకు జమచేసి పెండింగ్ క్లైమ్లను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని పట్టణ ప్రాంతాల్లో కూడా ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఎం పలనాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ కుమార్, కార్యదర్శి వర్గ సభ్యులు అనుముల లక్ష్మీశ్వర్ రెడ్డి, వై రాధాకృష్ణ, ఏపూరి గోపాల్ రావు, నాయకులు గుంటూరు పల్లి బాలకృష్ణ, పెండ్యాల మహేష్, గుంటూరు మల్లేశ్వరరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు వి కృష్ణయ్య



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 29,046
మిర్చి ఎగుమతి	: 27,633
మిర్చి నిల్వ	: 9,481

మిర్చి ధరలు

	రూపాయలలో
334	9,000 - 23,000
నెం.5	16,000 - 17,000
273	18,000 - 18,000
341	15,000 - 21,000
నాన్ ఎసి	
తేజ	10,000 - 24,000
బడిగి	13,000 - 26,500
దేవనూరు డీలక్స్	10,000 - 20,500
తాలుకాయలు	6,000 -14,000
ఎసి	
334	9,000 - 22,500
నెం.5	20,000 - 20,000
341	16,500 - 21,000
తేజ	14,000 - 24,000
బడిగి	11,500 - 25,000
తాలుకాయలు	6,500 -13,000

కెఎల్‌యుకు కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం అవార్డు

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్



కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీని సోమవారం నాడు కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రతినిధుల బృందం సందర్శించారు. ఈ సందర్భంగా వారు అనేక సంవత్సరాలుగా కేంబ్రిడ్జ్ అసెస్‌మెంట్ పరీక్షను విజయవంతంగా అందించినందుకు కెఎల్‌యు గెలుచుకున్న అవార్డును అందజేయడానికి వచ్చారని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తెలిపారు. కెఎల్ యూనివర్సిటీ ఎమర్జింగ్ స్టార్ ఆఫ్ ది ఇయర్ 2022-23 గా అవార్డు పొందిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంబ్రిడ్జ్ అసెస్‌మెంట్ ప్రతినిధుల బృందం అవార్డు ధ్రువీకరణ పత్రాన్ని రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావుకు, ఎఫ్ఇడి డైరెక్టర్ డాక్టర్ ఎ.జగదీష్‌లకు అందజేసి కెఎల్ యూనివర్సిటీ యాజమాన్యాన్ని, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొఫెసర్ వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్. ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, అంతర్జాతీయ సంబంధాల డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బోర్లు వేసి సాగునీటి వసతి కల్పించాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - కొల్లిపర

పేద రైతులు, కౌలురైతులకు సాగునీటి సౌకర్యం కల్పించాలని ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు జొన్నా శివశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని దావులూరులో రైతు, కౌలు రైతుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. గత ఎనిమిది దశాబ్దాలుగా సాగునీరు సక్రమంగా అందకపోయినా రైతులు సాగు చేస్తున్నారని , ప్రభుత్వం తక్షణం స్పందించి నీటి సౌకర్యం కల్పించే విధంగా బోర్లు వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి, నాయకులు జిలుగు ముక్కంటి, మద్దిన సాంబశివరావు, అర్జున్‌రావు, అంబటి వీరయ్య, కాబోతు దానేలు, గోపాల్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ నరసరావుపేట అదనపు సీనియర్ సివిల్ జడ్జ్ గారి కోర్టులో..
I.P.NO 40/2023

బిట్వీన్:
ఎస్.డి జిలాని. ... పిటీషనర్.
మరియుజి
పనిదెం హనుమయ్య మరియు ఇతరులు ... రెస్పాండెంట్స్.

To,
R1) పనిదెం హనుమయ్య S/o సాంబయ్య, జొన్నలగడ్డ గ్రామం, నరసరావుపేట మండలం, జెసిజెసి,పల్నాడు జిల్లా.
R2) కొత్తమాసు సుబ్బారావు S/o నాగసాంబశివరావు, నిమ్మతోట, నరసరావుపేట, పల్నాడు జిల్లా.
R3) కొత్తమాసు సతీష్ S/o వెంకట శ్రీనివాసరావు, నిమ్మతోట, నరసరావుపేట పట్టణం మరియు మండలం, జెసిజెసి, పల్నాడు జిల్లా.
R4) షేక్ సుభాని S/o ఖాసీం, ములకలూరు గ్రామం, నరసరావుపేట మండలం, పల్నాడు జిల్లా.
R5) గాలి రమేష్ S/o మల్లికార్జునరావు, గణపవరం గ్రామం, చిలకలూరిపేట మండలం, పల్నాడు జిల్లా.
R6) పార్లపల్లి హుస్సేన్ S/o lla సాహెబ్, లింగంగుంట్ల కాలనీ, నరసరావుపేట మండలం, జెసిజెసి, పల్నాడు జిల్లా జెసిజెసి.
R7) షేక్ తంగేళ్ల బాషా @ బాజి S/o afiz zama, ఐలా బజార్, నరసరావుపేట పట్టణం, పల్నాడు జిల్లా.
R8) మోటమర్రి నాగేశ్వరరావు S/o చిన అంతర్వేది, చిలకలూరిపేట రోడ్డు, లక్ష్మీ గాయత్రి హాస్పిటల్ ప్రక్కన, నరసరావుపేట పట్టణం, మరియు మండలం పల్నాడు జిల్లా.

పై నెంబర్ ఐపి నందు పిటిషనర్ అయిన ఎస్.డి జిలాని S/o మహబూబ్ సుభాని నరసరావుపేట, అదనపు సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు నందు ఐపి దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్ లో ఉదహరించిన రెస్పాండెంట్లు కాకుండా ఇంకనూ ఎవరికైనా ఇతరులకు బాకీ ఉన్న యెడల ది.11-10-2023 తేదీన ఉదయం 10:30 ని.లకు మీరు స్వయంగా కానీ న్యాయవాది ద్వారా కానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన వలెను.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో
వాయిదా : ది. 11-10-2023

ఇట్లు.
డి మల్లారెడ్డి, డి చిన్నపరెడ్డి, ఎస్.కె మీరావలి, జి.ప్రశాంత్ కుమార్, ఎస్.వై హనుమాన్ సాయి,
న్యాయవాదులు, ప్రకాష్ నగర్, నరసరావుపేట, పల్నాడు జిల్లా.
సెల్ నెం : 9441150500.

నోటీసు
మహారాజశ్రీ సత్తెనపల్లి సీనియర్ సివిల్‌జడ్జి కోర్టులో
I.A. No. 1274/2022 in O.S. No. 114/2017

బిట్వీన్:
కల్వకొల్లు హరినాథరావు మరియు మరొకరు ... పిటీషనర్లు - వాదులు
మరియు
యలగల నరసింహారావు మరియు మరొకరు ... రెస్పాండెంట్లు - ప్రతివాదులు

టు,
R1) యలగల నరసింహారావు, తండ్రి చినసోమయ్య, నివాసం : డోర్ నెం. 5-208, సాయిబాబాగుడి వద్ద, క్రోసూరు గ్రామం మరియు మండలం, పల్నాడుజిల్లా.
R2) కట్టెబోయిన సీతామహాలక్ష్మి, భర్త : దుర్గాప్రసాద్, నివాసం: క్రోసూరు గ్రామం మరియు మండలం, పల్నాడుజిల్లా.

పై నెంబరు గల దావా నెం. 114/2017లో శ్రీ కోర్టువారు డిక్రీ ఇచ్చినటువంటి డిక్రీ షెడ్యూల్ సవరణ నిమిత్తం పిటీషన్ I.A. No. 1274/2022 దాఖలు చేయగా ఆ పిటీషన్‌లో మీరు రెస్పాండెంట్స్ అయి వున్నారు. సదరు పిటీషన్‌లో మీకు కోర్టుద్వారా మరియు పోస్టుద్వారా నోటీసులు పంపియుండిన మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనుటకు కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు మీ యొక్క నోటీసులను పేపరు ప్రకటన ద్వారా తెలపవలసినదిగా ఉత్తర్వులు ఇచ్చి మీ యొక్క హాజరు నిమిత్తం ది. 14-11-2023న వాయిదా వేసియున్నారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ ఉదయం 10-30 గం.లకు హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేయ వలసినదిగా కోరటమైనది. లేనియెడల మీకై పరోక్షముగా తీర్మానించ బడునని ఇందుమూలంగా తెలియజేయటమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 14-11-2023
ది.9-10-2023

ఇట్లు
ఎల్.శ్రీహర్ష, బి.ఎల్.కోటేశ్వరరావు,
అడ్వకేట్స్, సత్తెనపల్లి.
సెల్ : 9290037775

మహారాజశ్రీ మంగళగిరి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
O.S. No. 5/2022

బిట్వీన్:
జమ్ముల వెంకట సుబ్బారావు .... వాది
అండ్
ఆళ్ళ చంద్రశేఖరరెడ్డి ... ప్రతివాది

To,
Alla Chandra Sekhar Reddy, S/o Siva Reddy, Aged about 36 years Business, R/o Penumaka Village, Tadepalli Mandalam, Guntur District.

పై నెంబరు దావాలోని వాది, ప్రతివాదిపై ప్రోనోటులు బాకీ వసూలు నిమిత్తం దావాను దాఖలు చేయగా పై నెంబరు దావాలో దావా సమనులు ఎన్ని పర్యాయములుపంపినను తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందు వలన శ్రీ కోర్టువారు పేపరు ప్రకటన ద్వారా దావా సమనులు అందజేయుటకు ఆర్డరు వేసియున్నారు. కావున మీరు ది. 16-10-2023 తేదీన ఉదయం 10-30 గం.లకు పై కోర్టులో మీరు స్వయంగా గానీ, లేదా మీ తరపు న్యాయవాది గారి ద్వారా గానీ హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేనిచో మీ పరోక్షమందు తీర్మానించెదరని యిందుమూలంగా తెలియజేయటమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది: 16-10-2023

ఇట్లు
కోకా వెంకట ప్రసాద్,
వాది తరపు న్యాయవాది, మంగళగిరి.

పేపరు ప్రకటన
మహారాజశ్రీ సత్తెనపల్లి సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
O.S. No. 438/2013

బిట్వీన్:
నేరెళ్ళ హనుమంతరావు .... వాది
అండ్
మాజేటి రాధాకృష్ణమూర్తి వగైరాలు ... ప్రతివాదులు

2వ ప్రతివాది :
చందోలు రమాదేవి, W/o సత్యనారాయణ,
3వ ప్రతివాది :
చందోలు బద్రినాథ్, S/o సత్యనారాయణ, Both are R/o రామాలయం దగ్గర, మెయిన్‌రోడ్డు, అమరావతి పోస్టు & మండలం, పల్నాడుజిల్లా.
5వ ప్రతివాది : తల్లం కాశీవిశ్వనాథం S/o బ్రహ్మయ్య, R/o మెయిన్‌రోడ్డు, అమరావతి పోస్టు & మండలం, పల్నాడుజిల్లా.

పై నెంబరు దావాలో కొత్తగా పార్టీలు ప్రతివాదులుగా చేరియున్నందున Neat Cop of Plaint దాఖలు చేసియున్నాను. ప్రతివాదులకు దావా సమన్లు శ్రీ కోర్టువారు ఉత్తర్వు చేసియున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ యొక్క హాజరు నిమిత్తం ది. 30-10-2023వ తేదీకి వాయిదా వేసియున్నారు. వాయిదా తేదీన మీరు పై తెలిపిన కోర్టులో స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ ఉదయం 10-30 గం.లకు హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనిచో మీపై పరోక్షంగా తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

వాయిదా : 30-10-2023
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
సత్తెనపల్లి
ది.9-10-2023

ఇట్లు
శ్రీ చలువాది చిన సత్యనారాయణ,
అడ్వకేట్, సత్తెనపల్లి.

గౌరవనీయులైన ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో, నరసరావుపేట.
ఓ.యస్. నెం. 59/2022

బిట్వీన్:
దివ్వెల వాసుదేవరావు ..... వాది
వర్సెస్
పూనాటి నాగరత్నమ్మ వగైరాలు ... ప్రతివాదులు

Summons to the 4th Defendant :
పూనాటి రాగసుధ ,తండ్రి (లేటు) వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేశ్వరరావు, భర్త : మందలపు శ్రీకాంత్, అమీన్‌సాహెబ్ పాలెం - 522 611. నాదెండ్ల మండలం, పల్నాడుజిల్లా.

యిందలి వాది బాకీ వసూలు నిమిత్తం పై నెంబరు దావా వేసి మీకు ఎన్నిసార్లు సమన్లు జారీ చేయించిననూ నోటీసులు తీసుకోకుండా మభ్య పెడుతున్నందున ఈ పత్రికా ముఖంగా మీకు నోటీసు జారీ చేసియున్నారు. ది. 18-10-2023 ఉదయం 10-30 గం.లకు పైన తెలిపిన కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలసినది. లేనియెడల మీ పరోక్షంలో తీర్మానించబడును.

(కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా : 18-10-2023
నరసరావుపేట
తేది:9-10-2023

కొండా సాంబశివరావు, ఎం.ఎ.,ఎల్‌ఎల్.ఎం.,
వాది తరపు న్యాయవాది.

మహారాజశ్రీ చిలకలూరిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జివారి కోర్టులో
ఓ.యస్. 173/2020

బిట్వీన్:
విజయబ్యాంక్ నౌ బ్యాంక్ ఆఫ్ బరోడా చిలకలూరిపేట బ్రాంచ్ ... ప్లెయింటిఫ్
వర్సెస్
కొనితాల తిరుమలదేవి, వగైరాలు .... డిఫెండెంట్స్

నోటీసు

టు,
డి2) షేక్ చినసైద, తండ్రి : మస్తాన్‌వలి, నివాసం: డోర్ నెం. 12-674/2, రహమత్‌నగర్, చిలకలూరిపేట టౌన్ మరియు మండలం, పల్నాడుజిల్లా.
డి3) పల్లబోతుల కాశీవిశ్వనాథం, తండ్రి : వెంకటేశ్వర్లు, డోర్ నెం. 25-15, సుబ్బయ్యతోట, చిలకలూరిపేట టౌన్ మరియు మండలం, పల్నాడుజిల్లా.

పై నెంబరు గల దావాలో మీరు 2, 3 ప్రతివాదులై వున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టువారు మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపినను తీసుకొనక కాల యాపన చేయుచున్నారు. దరిమిలా శ్రీ కోర్టువారు మీకు పేపరు నోటీసు నిమిత్తమై ది. 16-10-2023 తేదీకి వాయిదా వేసియున్నారు. మీరు ది. 16-10-2023 వ తేదీ ఉదయం 10-00 గం.లకు శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ వాదనలు ఏమైనా వుంటే శ్రీ కోర్టువారికి స్వయంగా గాని, ప్లీడరుగారి ద్వారా గానీ తెలియ జేసుకొనగలరు. అలా చేయని యెడల సదరు కేసును మీ పరోక్షమున శ్రీ కోర్టువారు తీర్మానించ గలరని ఇందుమూలంగా తెలియజేయట మైనది.

వాయిదా : 16-10-2023
స్థలం : చిలకలూరిపేట
తేది: 9-10-2023

ఇట్లు
ఎస్.సుధాకరరెడ్డి,
అడ్వకేట్,
చిలకలూరిపేట,
సెల్ : 9490897827.

మహారాజశ్రీ పిడుగురాళ్ళ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టు
ఓ.యస్.నెం. 108/2023

బిట్వీన్:
పొన్నం వెంకటప్పయ్య .... వాది
మరియు
కొనకంచి వెంకటేశ్వర్లు ... ప్రతివాది

టు : ప్రతివాది :
కొనకంచి వెంకటేశ్వర్లు, తండ్రి మల్లయ్య, పూర్వం క్రోసూరు గ్రామం, మండలం, పల్నాడుజిల్లా, ప్రస్తుతం : డోర్ నెం. 4-22-57/ఎ, 3వ లైన్, గౌతమినగర్, గుంటూరు.

పై నెంబరు దావాను వాది ప్రామిసరీ నోటు బాకీ రాబట్టుకొను నిమిత్తం మీపై దాఖలు చేసియున్నాడు. అలాగే పై వాది చామర్రు గ్రామ డి.నెం. 168లోని య.1.33 సెంట్లు మరియు డి.నెం. 178లోని య.1.00 సెంట్లును కోర్టువారిని జప్తు చేయమని కోరుచూ ఐ.ఎ. నెం. 498/2023ను పై కోర్టు యందు దాఖలా చేసియున్నాడు. సదరు దావా మరియు జప్తు పిటీషన్‌కు సంబంధించిన సమన్లు, నోటీసులు పంపిననూ మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొని యుండలేదు. కావున పైన తెలిపిన దావాలో మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనుటకు శ్రీ కోర్టువారు తేది: 17-10-2023న వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ ప్లీడరు ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనవలసినది. అట్లు హాజరు కాని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించ బడునని యిందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వాయిదాతేది: 17-10-2023

యం.శ్రీనివాసరావు,
వాది తరపు న్యాయవాది, పిడుగురాళ్ళ.

మహారాజశ్రీ చిలకలూరిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
ఓ.యస్. 197/2018

బిట్వీన్:
విజయబ్యాంక్, చిలకలూరిపేట బ్రాంచ్... ప్లెయింటిఫ్
వర్సెస్
విఘ్నేశ్వర మహిళా పొదుపు సంఘం వగైరాలు .... డిఫెండెంట్స్

నోటీసు

టు,
పేర్ల సాంబ్రాజ్యం, భర్త : అంకమ్మ, డోర్ నెం.6-213, 3వ వార్డు, చిలకలూరిపేట టౌన్ మరియు మండలం, పల్నాడుజిల్లా.

పై నెంబరు గల దావాలో మీరు 6వ ప్రతివాది అయి వున్నారు. సదరు పై దావాలో మీకు శ్రీ కోర్టువారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. దరిమిలా శ్రీ కోర్టువారు మీకు పేపరు ద్వారా నోటీసు నిమిత్తమై ది. 31-10-2023 తేదీకి వాయిదా వేసియున్నారు. మీరు ది. 31-10-2023వ తేదీ ఉదయం 10-00 గం.లకు శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ వాదనలు ఏమైనా వుంటే శ్రీ కోర్టువారికి స్వయంగా గాని, ప్లీడరుగారి ద్వారా గానీ తెలియ జేసుకొనగలరు. అలా చేయని యెడల సదరు దావాను మీ పరోక్షమున శ్రీ కోర్టువారు తీర్మానించ గలరని ఇందుమూలంగా తెలియజేయట మైనది.

వాయిదా : 31-10-2023
స్థలం : చిలకలూరిపేట
తేది: 9-10-2023

ఇట్లు
ఎస్.సుధాకరరెడ్డి,
అడ్వకేట్,
చిలకలూరిపేట,
సెల్ : 9490897827.



చేగువేరా చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పిస్తున్న నాయకులు

చేగువేరాకు సిపిఎం నివాళి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల : క్యూబా విప్లవ యోధుడు చేగువేరా 56 వర్ధంతి సందర్భ:గా పట్టణంలోని ప్రజాశక్తి నగర్ కన్నెగంటి హనుమంతు భవనంలో సిపిఎం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా చేగువేరా చిత్రపటానికి సిపిఎం మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు పూలమాలలేసి మాట్లా డారు. క్యూబా విప్లవ పోరాటంలో కీలక మాత్ర పోషించిన చేగువేరా అనంతరం అనేక దేశాల విముక్తి కోసమూ పోరాడారన్నారు. పలు దేశాల్లో సమస్యల అధ్యయనం కోసం మోటారు సైకిల్‌పై ప్రయాణించారని, ప్రజలను చైతన్య వంతం చేయడానికి కృషి చేశారని చెప్పారు. ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా చివరి వరకు పోరాడారన్నారు. కార్యక్ర మంలో బి.వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, జైకృష్ణ నాయక్ పాల్గొన్నారు.



ప్రజాశక్తి - ఫిరంగిపురం : మండలంలోని పొనుగుపాడులో చిత్రపటానికి ఎం.రవీంద్ర, సిఐటియు మస్తాన్‌వలి పూలమాలలేశారు. అనంతరం మస్తాన్‌వలి మాట్లాడారు.

పల్నాడు కళాక్షేత్రం ఆధ్వర్యంలో షార్ట్ ఫిలిమ్ ఫెస్టివల్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని పల్నాడు బస్టాండ్ వద్ద గల పల్నాడు కళాక్షేత్రంలో షార్ట్ ఫిలిమ్ ఫెస్టివల్‌ను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదివారం రాత్రి ప్రారంభించారు. 'విమానం' సినిమా దర్శకులు శివప్రసాద్ యానాల, యువ కవి కట్టా సిద్ధార్ధ జ్యూరీ మెంబర్‌లుగా వ్యవహరించారు. షార్ట్ ఫిలిం ఫెస్టివల్స్‌కు 19 ఎంట్రీలు రాగా ఉత్తమ శ్రేణికి మైరా, వై ఇండిపెండెన్స్, వ్యక్తిత్వం అనే మూడింటిని ఎంపిక చేశారు. జూరీ బహుమతిగా ఐదు వేళ్ళ, మాది ఏ కులం?, తత్వం ఎంపికయ్యాయి. విజేతలకు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జెసి ఎ.శ్యామ్‌ప్రసాద్ బహుమతులు ప్రదానం చేశారు. ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, పల్నాడు కళాక్షేత్రం అధ్యక్షులు పి.ఈశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం బాష పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పసుమర్రు జెడ్‌పి విద్యార్థులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట



పసుమర్రులోని శ్రీ మద్ది కామయ్య జెడ్‌పి పాఠశాల విద్యార్థినులు నలుగురు రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు, ఒక విద్యార్థి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం వై.హనుమంతరావు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు కోట అమూల్య, తోట ఉషారాణి, దేవరకొండ దైవకీర్తి, నార్నెపాటి పార్వతి ఎంపిక కాగా బాక్సింగ్ పోటీలకు గుంజి వెంకట శ్రావణ్ కుమార్ ఎంపికైె నట్లు చెప్పారు. వీరితోపాటు శిక్షణిచ్చిన పిఇటిలు పఠాన్ ఖాదర్ మస్తాన్‌ను ఎంఇఒ కె.లక్ష్మి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వై.వెంకటసుబ్బయ్య, వైస్ చైర్‌పర్సన్ టి.నాగవర్ధిని, కౌన్సిలర్లు జె.సుబ్బారావు, షేక్ మస్తాన్‌వలి అభినందించారు.

నకిలీ పత్రాలతో కొడుకు రుణం

రక్షణ కోసం నవదంపతులు వినతి



తాము దగ్గరి బంధువులమే అయినా వివాహానికి పెద్దలు అంగీకరించలేదని, అందుకే ఇంట్లో నుండి బయటకు వచ్చి పెళ్లి చేసుకున్నామని అమరావతి మండలం అత్తలూరుకు చెందిన ఏసోబు, ఝాన్సీ చెప్పారు. తమ పెద్దలను ఒప్పించాలని, తమకు రక్షణ కల్పించాలని కోరారు.

039. నకిలీ పత్రాలతో కొడుకు రుణం



1995లో భరంపేట 33వ వార్డులో 3 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేసి 1999లో ఇల్లు కట్టుకున్నామని, అయితే తమ ముగ్గురు కుమారుల్లో రెండో కుమారుడు శ్రీనివాసరావు ఇంటికి సంబంధించి నకిలీ పత్రాలు సృష్టించి ఓ ప్రైవేటు ఫైనాన్స్‌లో రూ.10 లక్షలు రుణం తీసుకున్నాని, దీంతో ఫైనాన్స్ కంపెనీ వారు తమకు ఇళ్లు ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చారని జమ్ముల పున్నయ్య, సీతారామ్మ దంపతులు వాపోయారు. ఫైనాన్స్ వారు తమను బెదిరిస్తున్నారని, తమకు న్యాయం చేయాలని కోరారు.

స్థలంపైనా అన్న కన్ను



రైల్వే గేట్ మెన్‌గా ఉద్యోగం చేస్తున్న తమ తండ్రి 2009లో అనారోగ్యంతో మృతి చెందగా కారుణ్య నియామకం కింద అన్న అంకమ్మరావు ఉద్యోగం పొందాడని, తన తండ్రికి సంబంధించిన 5 సెంట్ల తాను తీసుకునేలా పెద్దల సమక్షంలో ఒప్పందం కుదిరిందని నరసరావుపేట మండలం కేసనపల్లికి చెందిన మాతంగి మేరిబాబు తెలిపారు. అయితే ఇప్పుడు స్థలంపైనా తన అన్న కన్నేశాడని, దాన్ని తనకు స్వాధీనం చేయకుండా బెదిరిస్తున్నాడని వాపోయారు.

పాస్టర్ మోసంపై వికలాంగుని ఫిర్యాదు



ఇల్లు కట్టి, అమెరికాకు చెందిన సంస్థ నుండి రాయితీలు ఇప్పిస్తామని చెప్పి ఏనుగుదిన్నెలపాడుకు చెందిన పాస్టర్ పౌలురాజు, అతని బంధువు బాబు తనను మోసం చేశారని ఈపూరు మండలం అగ్నిగుండాలకు చెందిన వికలాంగుడు వినుకొండ నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. తన వద్ద వారిద్దరూ రూ.4.50 లక్షలు తీసుకుని మూడేళ్లవుతున్నా ఇంటిని మాత్రం నిర్మించలేదని, వారికి తాను ఇంటి స్థలాన్ని తనఖా పెట్టి రూ.3 వడ్డీకి అప్పు చేసి మరీ డబ్బులు ఇచ్చానని తెలిపారు.

పొలంలో నాగలి దగ్ధమైంది



పొలం పక్కన పొలానికి చెందిన రైతు యామవరపు పుల్లారావు పత్తి కట్టె తగులబెడుతుండగా ఆ మంటలు తన పొలానికి వ్యాపించి రూ.10 వేల నాగలి దగ్ధమైందని, దీనిపై పుల్లారావును ప్రశ్నించగా బెదిరిస్తున్నాడని అచ్చంపేట మండలం కస్తలకు చెందిన ఏసోబు ఫిర్యాదు చేశారు. తాను అచ్చంపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా రెండ్రోజుల పాటు తననే స్టేషన్‌కు పిలిపించారని, పుల్లారావును మాత్రం పలిపించలేదని, తనకు న్యాయం చేయాలని కోరారు.

పొలంలో కక్షపూరితంగా కాల్వ తవ్వకం



తమ పొలంలో కాల్వను అక్రమంగా తవ్వడంతోపాటు పత్తి పంటనూ ధ్వసం చేశారని షేక్ సైదా, అబ్బాస్ అలీ, షేక్ పెద్దసైదాపై రాజుపాలెం మండలం రెడ్డిగూడేనికి చెందిన వికలాంగుడు నిమ్మకాయల మహబూబ్ ఫిర్యాదు చేశారు. తన భార్యకు పసుపు కుంకుమ కింద వచ్చిన 74 సెంట్ల పొలం వచ్చిందని, అయితే పొలానికి నీరు సరఫరా అవగానికి ఇప్పటికే కాల్వ ఉన్నా నిందితులు మాత్రం తమపై కక్షతో తమ పొలంలోనే కాల్వ తవ్వారని వాపోయారు.

వాటా డబ్బులు ఇవ్వడం లేదు



తమకు రావాల్సిన డబ్బులను ఇవ్వకుండా పెదకూరపాడుకు చెందిన కాంట్రాక్టర్లు గుండపనేని బాష, దర్శి రవి ఇబ్బంది పెడుతున్నారని కృష్ణమనేని అనంతలక్ష్మి ఫిర్యాదు చేశారు. తన భర్త కృష్ణప్రసాద్ ఎనిమిదేళ్ల నుండి కాంట్రాక్టర్లతో కలిసి ప్రభుత్వ సిమెంట్ పనులు చేశారని, ఆ పనుల తాలుకు రూ.80 లక్షలను తన భర్త వాటాగా పెట్టారని, అయితే ఆయన 2021లో మృతి చెందారని తెలిపారు. అనంతరం బిల్లులు మంజూరవగా వాటిని కాంట్రాక్టర్లే తీసుకుని తన భర్త వాటా డబ్బులు మాత్రం ఇవ్వడం లేదని చెప్పారు. అప్పులు చేసిమరీ తన భర్త డబ్బులిచ్చారని, అప్పులవాళ్ల ఒత్తిళ్లు పెరిగాయని, తమకు డబ్బు ఇప్పించాలని కోరారు.

ఇదిలా ఉండగా ఇంటి నిర్మాణం కోసం రూ.2.50 లక్షలు తీసుకున్న కాంట్రాక్టర్ పనులు చేయించకుండా, డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని నరసరావుపేటకు చెందిన మహిళ, తన కొడుకు అప్పులు చేసి పారిపోగా ఆ డబ్బులు తనను చెల్లించాలని ఒకరు బెదిరిస్తున్నారని మాచర్లకు చెందిన మరో మహిళ, బీడు భూమిలో గేదెలను మేపొద్దన్నందుకు దాడి చేశారని క్రోసూరు మండలం విప్పర్లకు చెందిన మరోకరు ఫిర్యాదు చేశారు.



పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుండి ఫిర్యాదులను ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి స్వీకరించారు. వీటిని సకాలంలో పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఇదిలా ఉండగా అర్జిదార్లకు పట్టణానికి చెందిన మోటుపల్లి అంజి భోజనాన్ని సమకూర్చగా ఆర్గనైజర్లు బి.వెంకట సత్యనారాయణ, మధుసూదనరావు, చిన్ని వెంకట శ్రీనివాసరావు వడ్డించారు. కార్యక్రమంలో ఎఎస్‌పిలు (అడ్మిన్) ఆర్.రాఘవేంద్ర, డి.రామచంద్ర రాజు (ఎఆర్), ఎస్.కె చంద్రశేఖర్ (క్రైమ్), డీఎస్పీలు కె.వి.మహేష్, పి.రాజు, బి.ఆదినారాయణ, యు.రవిచంద్ర పాల్గొన్నారు.
ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పొలాలను ఖాళీగా ఉంచొద్దు..

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయండి - రైతు భరోసా కేంద్రాల్లో రాయితీపై విత్తనాలు : కలెక్టర్



పత్తిపొలంలో లింగాకర్షణ బుట్టల పనితీరును గురించి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా


తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలు సాగు వైపు రైతులు మొగ్గు చూపాలని, పొలాలను ఖాళీగా ఉంచకుండా ఏదో ఒక పంట సాగు చేయాలని రైతులకు పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సూచించారు. నాదెండ్ల మండలం సాతులూరు, నరసరావుపేట మండలం జొన్నలగడ్డ, ములకలూరు గ్రామాల్లో పొలాలను కలెక్టర్ సోమవారం పరిశీలించారు. సాతులూరులో పత్తిపైరులో అంతర పంటగా కంది సాగుపై అభినందించారు. అనంతరం జొన్నలగడ్డ రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. ఈ-క్రాప్ నమోదు, ఇకెవైసి పారదర్శకంగా జరగాలన్నారు. మినుము, పెసర, కంది విత్తనాలను 80 శాతం రాయితీపై, రబీలో పండించేందుకు అనుకూలమైన శనగ పంట విత్తనాలను 40 శాతం రాయితీపై పంపిణీ కోసం రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. అనంతరం ములకలూరు రైతులకు రాయితీపై మినుము, పెసర, కంది, శనగ విత్తనాలను అందజేశారు.

ఎంఎస్ స్వామినాథన్‌కు నివాళి

ఎంఎస్ స్వామినాథన్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్‌లోని డాక్టర్ బి.ఆర్ స్పందన సమావేశ మందిరంలో స్వామినాథన్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ స్వామినాథన్ కుటుంబ సభ్యులందరూ డాక్టర్లయినా ఆయన మాత్రం దేశం కోసం వ్యవసాయ శాస్త్రవేత్త అయ్యారని, హరిత విప్లవంతో దేశంలో ఆహార కొరతను తీర్చారని చెప్పారు.

ప్రతిభావంతురాలైన పేద విద్యార్థినికి సాయం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



శిలా రాణి భాయ్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న కలెక్టర్

బెల్లంకొండ మండలం రేమిడిచర్లకు చెందిన పేద విద్యార్థిని భూక్య శిలారాణి బాయ్ బీఫార్మసీలో టాపర్‌గా నిలిచి జి.ప్యాట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఆంధ్రా యూనివర్సిటీలో ఎం.ఫార్మసీలో సీటు పొందారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థినిని ఉన్నత చదువుల్లో ప్రోత్సహించడానికి కలెక్టర్ చొరవ చూపారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ తరపు నుంచి రూ.70 వేల సాయాన్ని సమకూర్చి సోమవారం కలెక్టరేట్‌లో అందించారు. ఆయా కార్యక్రమాల్లో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డిఆర్ఒ కె.వినాయకం, డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ రమేష్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఐ.మురళి, జొన్నలగడ్డ సర్పంచ్ కె.చిన్న, ఎంపిటిసి ఐ.సానియా, ఏపీ సీడ్స్ మేనేజర్ సుబ్బయ్య, సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మస్తానమ్మ, శివకుమారి, ఏవోలు నరేంద్రబాబు, హరిప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారులు ఫిలిప్, బ్రహ్మయ్య, డిఇఇ కె.శామ్యూల్, పాల్గొన్నారు.

కృపమ్మ మృతికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఆశాల సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి

ప్రజాశక్తి-తాడేపల్లి

పని ఒత్తిడి వల్ల తాడేపల్లిలో ఆశ వర్కర్ కృపమ్మ మృతికి కారణమైన మెడికల్ అధికారి మానసమంజరి, హెచ్‌యు రమాదేవిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఆశ వర్కర్లు విధులు బహిష్కరించారు. అనంతరం ప్రకాష్‌నగర్ సిఐటియు కార్యాలయంలో జరిగిన ఆశ వర్కర్ల సమావేశంలో ధనలక్ష్మి పాల్గొని మాట్లాడారు. అనేక యాప్‌ల పేరుతో ఎఎన్‌ఎంలు, ఆశ వర్కర్లపై మంజరి, రమాదేవిల వేధింపులు అధికమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నైపుణ్యం లేని పనులు, మించిన పనులు అప్పగిస్తున్నారన్నారు. కనీస వారానికి ఒక రోజైనా సెలవు ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. విశ్రాంతి లేకుండా పని చేయడం వల్లే కృపమ్మ మృతిచెందిందన్నారు. కృపమ్మ మృతి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం నుంచి తాడేపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్నట్లు ప్రకటించారు. సమావేశంలో సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, ఆశాలు విజయశ్రీ, రేణుక, లక్ష్మి, సుగుణ, కె.జ్యోతి, కుమారి, విజయలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధనలక్ష్మి

అధికారులపై చర్య తీసుకోవాలని సిఐటియు వినతి

ప్రజాశక్తి-గుంటూరు :మంగళగిరి-తాడేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రకాష్ నగర్ యుపిహెచ్‌సిలో పనిచేస్తున్న ఆశా వర్కర్ రేపూడి కపమ్మ మతికి కారణమైన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మానస మంజరి, హెల్త్ విజిటర్ రమాదేవిపై చర్యలు తీసుకోవాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్(సిఐటియు) నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ.శ్రావణబాబు, జిల్లా కలెక్టర్ కార్యాలయ అధికారి ఎం.పూర్ణచంద్రరావుకు వినతిపత్రం అందించారు. చనిపోయిన ఆశ వర్కర్ రేపూడి కపమ్మ చిన్న వయసులోనే ఎలాంటి అనారోగ్యం లేదని, కేవలం అధికారుల ఒత్తిళ్లతోనే చనిపోయిందన్నారు. అక్కడ పనిచేస్తున్న అధికారులు ఆశా వర్కర్లను, ఏఎన్‌ఎంలను తీవ్ర మానసిక ఒత్తిళ్లకు గురి చేస్తున్నారని, గత 20 రోజులుగా అవిశ్రాంతంగా, బలవంతంగా పనిచేయించారని, నిత్యం అక్కడ మెడికల్ ఆఫీసర్, హెల్త్ విజిటర్ వేధింపులకు గురి చేశారన్నారు. ఏఎన్‌ఎంలను, ఆశ వర్కర్లను దుర్భాషలాడుతూ పనిఒత్తిడి పెంచారన్నారు. ఫలితంగా ఆశా వర్కర్ నిండు ప్రాణం బలైందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా ఉండాలంటే అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూని యన్ జిల్లా గౌరవాధ్య క్షులు వై. నేతాజీ, యూనియన్ జిల్లా నాయకులు వి. రేణుక , సిహెచ్ సుగుణ తదితరులు పాల్గొ న్నారు


డిఎంఅండ్‌హెచ్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి : జిల్లా ఎస్‌పి

ప్రజాశక్తి-గుంటూరు సిటి

గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫ రెన్స్ హాలులో స్పందన అర్జీలను జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ బాధితుల నుండి సోమవారం స్వీకరించారు. జిల్లాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలపై సం బంధిం చిన అధికారులతో ఫోన్లో మాట్లాడి చట్ట పరిధిలోని సమ స్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశిం చారు. స్పందన కార్యక్రమంలో ఎక్కువగా కుటుంబ కల హాలు, ఆస్తి తగాదాలు, భూ వివాదాలు, ఆర్థికపరమైన అంశాలతో పాటు సమస్యలతో ఇతర సైబర్ సమస్యలపై ఎక్కువ మంది ఫిర్యాదు చేసినట్లు జిల్లా ఎస్పీ ఆరిఫ్ ఆఫీజ్ తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్, పాటు డి.ఎస్.పి లు ప్రకాష్ బాబు , సిఐ లు శ్రీనివాస రావు, బెల్లం శ్రీనివాస రావు , వెంకన్న చౌదరి , ఐటీ కోర్ ఎస్సై శ్రీనాథ్ ఎస్పీ సిసి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పి

హెల్త్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలకు వినతి

గుంటూరు రైల్వే స్టేషన్‌లో హెల్త్ ఇనస్పెక్టర్‌గా పనిచేస్తున్న ఆర్. రవిబాబు పై చర్యలు తీసుకోవాలని రైల్వే స్టేషన్‌లో శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న కొందరు మహిళలు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు తమతో అమర్యాదగా, దురుసుగా ప్రవర్తించడంతోపాటు దుస్తులు మార్చుకున్న సమయంలో నేరుగా రూమ్ లోనికి వస్తున్నాడని, మరి కొన్నిసార్లు మహిళలు వాడే మరుగుదొడ్డిలోకి ప్రవేశిస్తున్నాడని, తెలిపారు. మహిళల పట్ల నీచంగా మాట్లాడుతూ మానసికంగా హింసిస్తున్న రవిబాబుపై చర్యలు తీసుకోవాలని ఎస్‌పి కి వినతి పత్రం ఇచ్చారు.

భర్త వేధింపుల నుండి కాపాడండి

తెనాలి ఐతనగర్ చెందిన వనజాక్షి తన మొదటి భర్త సురేష్ బాబు 8 సంవత్సరాల క్రితం మరణించడంతో సుగుణపల్లి అనిల్ కుమార్ పెద్దల సమక్షంలో రెండో పెళ్లి చేసుకుంది. పెళ్లయిన 3నెలలు తర్వాత ఎటువంటి పని చేయకుండా తన జీతం పై ఆధారపడి అప్పులు చేస్తూ రోజూ తాగి వచ్చి కొడుతున్నాడని, ఎవరికైనా చెప్తే తనతో పాటు తన మొదటి భర్తకు పుట్టిన బిడ్డను చంపేస్తానని బెదిరిస్తున్నాడని గ్రీవెన్స్ లో ఎస్పీకి ఫిర్యాదు చేసింది.

మా ప్రమేయం లేకుండానే మా పేర్లతో ఫిర్యాదు

మెప్మా ఉద్యోగుల వినతి

తమకు తెలియకుండా తమ సంతకాలతో గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారని మెప్మాకు చెందిన కొందరు మహిళా ఉద్యోగస్తులు ఎస్‌పికి వినతి పత్రం ఇచ్చారు. ఉమ్మడి గుంటూరు జిల్లా మెప్మా రివ్యూ మీటింగ్ అని కమ్యూనిటీ ఆర్గనైజర్, సిటీ మిషన్ మేనేజర్స్ (సి ఓ , సీ.ఎం.ఎం) ఉద్యోగస్తులను పిలిచి వారి వద్ద నుండి తెల్ల కాగితంపై సంతకాలు తీసుకొని, మెప్మాలో జరుగుతున్న అవకతవకలపై కొద్ది కాలంగా రైట్ ఇన్ఫర్మేషన్ యాక్ట్ (ఆర్టిఐ) ద్వారా ప్రశ్నిస్తున్న లాయర్ కర్లపూడి బాబు ప్రకాష్ పై గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేయించారని వారుఆరోపించారు.ఉమ్మడి గుంటూరు జిల్లా మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ పిడుగు వెంకటనారాయణ పై గత కొద్ది నెలగా పలు అవినీతి ఆరోపణలపై విచారణ జరుగుతున్నాయని, సదురు విచారణకు కారణమైన బాబు ప్రకాష్ పై తమకు తెలియకుండా తమ సంతకాలను సోమవారం ఉదయం నైట్ వాచ్మెన్ నాగరాజు తీసుకొని , మెప్మా మహిళా ఉద్యోగులను తిట్టినట్టుగా సౌభాగ్యలత కీర్తి విజయలక్ష్మి ప్రణతి లచే ఎస్పీ గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేయించారన్నారు. మా ప్రమేయం లేకుండా మా పేర్లతో గ్రీవెన్స్ కు వచ్చిన ఫిర్యాదును ఎస్పీని కలసి వెనక్కి తీసుకునేందుకై తాము వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట, తెనాలి, మాచర్ల, వినుకొండ, సత్తనపల్లి, మంగళగిరి, తాడేపల్లి, బాపట్ల కు చెందిన సి ఓ లు సిఎంఎంలు పాల్గొన్నారు.

ఉండవల్లి ఎత్తిపోతల పథకానికి పవర్ కట్

రూ.16 లక్షలు బకాయిలు చెల్లించాలని కనెక్షన్ తొలగింపు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లి ఎత్తిపోతల పథకానికి సోమవారం విద్యుత్ అధికారులు పవర్ కట్ చేశారు. ఎత్తిపోతల పథకానికి సంబంధించి రూ.16 లక్షల బకాయిలు చెల్లించనందున విద్యుత్ కనెక్షన్ తొలగించినట్లు అధికారులు చెబుతున్నారు. కనెక్షన్ తొలగించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎత్తిపోతల పథకం కింద సుమారు 300 ఎకరాల్లో వరితో పాటు పలు పంటలు పండిస్తున్నారు. విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరించకపోతే పంటలు ఎండిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఉండవల్లి లిఫ్టు నడపాలని, గతంలోనే తాము చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతుల భాగస్వామ్యం పేరుతో కమిటీలు ఏర్పాటు చేసి ఎన్నికల తంతు నిర్వహించి లిఫ్టు బాధ్యతలను రైతుల నెత్తిన పెట్టారని తెలిపారు. అప్పటి నుంచి రైతులకు కష్టాలు తప్పడంలేదని చెప్పారు. కరెంటు కట్ చేయడంతో స్కీమ్‌లో ఉన్న మూడు మోటార్లు పని చేయడం మానేశాయన్నారు. రైతులు వేసిన పైర్లు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కోట్ల రూపాయలు బకాయి పడ్డ ప్రభుత్వ కార్యాలయాల జోలికి వెళ్లని విద్యుత్ శాఖ దేశానికి పట్టెడు అన్నం పెట్టే రైతుకు చెందిన లిఫ్టు ఇరిగేషన్‌కు కరెంటు కట్ చేయడం సరైనది కాదన్నారు. యుద్ధప్రాతిపదికన ప్రభుత్వం ఉండవల్లి లిఫ్టుకు విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజధాని రైతు సంఘం అధ్యక్షులు కె.ఈశ్వరరెడ్డి, తాడేపల్లి మండల రైతు సంఘం కార్యదర్శి మోదుగుల శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు వీరాస్వామి, ఇస్సాకు, యు.రామారావు, ఎస్.పెదభాస్కరయ్య పాల్గొన్నారు. అనంతరం 11 మందితో పోరాట కమిటీ ఏర్పాటైంది.


ఆందోళన చేస్తున్న రైతులు, మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

నాగుర్ బాషాకు ఎక్సెలెన్స్ అవార్డు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ షేక్ నాగుర్ బాషా కు గ్లోబల్ హెల్త్ కేర్ ఎక్సెలెన్స్ అవార్డు కు ఎంపికయ్యారు. ఈ నెల 12 వ తేదీన ఢిల్లీలో జరగనున్న ప్రతిస్థాత్మకమైన గ్లోబల్ ఎక్స్ లెన్సు అవార్డు ను క్రికెట్ లెజెండ్ సునీల్ గవాస్కర్ చేతుల మీదుగా డాక్టర్ నాగూర్ బాషా అందుకోనున్నారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఆయన కు అరుదైన గౌరవం దక్కడం విశేషం. ఈ వేడుకలకు దేశంలో 100 నుంచి 200 మంది ప్రతినిధులు హాజరు కానున్నారు.

జాతీయ తపాలా వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు తపాలా డివిజన్ పరిధిలో సోమవారం జాతీయ తపాల వారోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఈ వారోత్సవాలలో భాగంగా 13వ తేదీ వరకూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ యు.యల్లమందయ్య తెలియజేశారు. మొదటి రోజు అన్ని తపాలా కార్యక్రమాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, 10న సామాన్య ప్రజల్ని భాగస్వామ్యం చేయటానికి జనంలోకి మనం అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు పొదుపు పథకాలు, తపాలా జీవిత బీమా పాలసీలు, ఐపిపిబి సేవలపై అవగాహన కల్పిస్తామన్నారు. 11న ఫిలాటలీ దినోత్సవంలో భాగంగా పాఠశాలల్లో ధాయ అకర్ ఉత్తరాల పోటీ, 12న తపాలా పార్సెల్ సేవల్లో వచ్చిన మార్పులపై అవగాహన, చివరిగా 13న గ్రామాలలో ఆధార్ నమోదుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలని యల్లమందయ్య కోరారు.



12న గుంటూరులో 5కె రన్

జయప్రదం చేయాలని వర్సిటీలో బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎఎన్‌యు

గుంటూరు బిఆర్ స్టేడియంలో 12వ తేదీన నిర్వహించే రాజు (మంతెన) 'రవి' (నారాలసెట్టి) ఓపెన్ 5కె రన్ విజయవంతంగా నిర్వహించాలని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విసి పి రాజశేఖర్ కోరారు. సోమవారం వర్సిటీలో 5కె రన్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ రన్ జయప్రదం చేయడానికి వర్సిటీ వ్యాయామ విభాగం తమ వంతు సహకారం అందిస్తుందని విసి తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ విద్యసంచాలకులు ఆచార్య పి జాన్సన్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పి సిద్దయ్య, ఏపీ అథ్లెటిక్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరి జీవి ఎస్. ప్రసాద్, పోటీల అధ్యక్షుడు నరాలశెట్టి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజమండ్రి జైలుకు పోస్టు కార్డులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అక్రమ కేసుల నుంచిబయటపడి చంద్రబాబు నాయుడు మళ్లీ ముఖ్యమంత్రిగా అయ్యేవరకు తెలుగు ప్రజలను ఏకం చేసి యువత, విద్యార్థి లోకం అండగా నిలబడతామని జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి పిలుపునిచ్చారు. సోమవారం చంద్రబాబు నాయుడుకి సంఘీభావం తెలుపుతూ సాయికష్ణ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు పోస్టుకార్డుల రూపంలో ఉత్తరాలు గుంటూరు కలెక్టరేట్ ఎదుట పోస్టాఫీసు బాక్సులో తెలుగుయువత విద్యార్థులు, ప్రజల వద్ద వ్రాసి సేకరించిన ఉత్తరాలు భారీగా వేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా తెలుగుయువత ప్రధాన కార్యదర్శి షేక్ నాగుల్ మీరా, ఉపాధ్యక్షులు గుత్తికొండ కిరణ్, ప్రచార కార్యదర్శి చెరుకుపల్లి నాగరాజు, అధికార ప్రతినిధి షేక్ షుకూర్, కార్యనిర్వాహక కార్యదర్శి మన్నెం శ్రీనివాస్ రావు, కార్యదర్శి మాచవరపు దాసు తదితరులుపాల్గొన్నారు.



ఆర్డీఓ రాజకుమారి కి వినతిపత్రం అందజేస్తున్న చిత్రం

కొండమోడు-పేరేచర్ల రోడ్డు విస్తరణ చేపట్టండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

కొండమోడు-పేరేచర్ల రోడ్డు విస్తరణ చేపట్టాలని సత్తెనపల్లి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు చిన్న బోయిన రాఘవరావు డిమాండ్ చేశారు. తెలుగుయువత ఆధ్వర్యంలో టిడిపి నాయకులు ఆర్డీఓ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రాఘవరావు మాట్లాడుతూ ప్రతినిత్యం యాక్సిడెంట్లు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని, కాళ్లూచేతులు విరిగి కొందరు వికలాంగులుగా మారుతున్నారని అన్నారు. మాచర్ల-పిడుగురాళ్ల నుండి గుంటూరు వరకు ప్రతినిత్యం వేల మంది ప్రయాణం చేస్తున్నారని, రోడ్డుపై భారీ గుంతల వల్ల ప్రమాదాలు జరుగుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కనీసం తగుంతలు అయినా పూడ్చాలని కోరారు. అనంతరం సత్తెనపల్లి ఆర్ డిఒ బిఎల్ ఎన్ రాజ కుమారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు ఎన్.కార్తీక్, నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షులు ఎం.హనుమంతరావు. నియోజకవర్గ తెలుగు యువత అధికార ప్రతినిధి రంజాన్ వలి, సత్తెనపల్లి మండలం తెలుగు యువత ఉపాధ్యక్షులు టి.వెంకటేష్, సీనియర్ నాయకులు పి.వెంకట కోటయ్య, కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించండి

మున్సిపల్ ఫోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు డిమాండ్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

టిడ్కో గృహ లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలని టిడిపి మున్సి పల్ ఫోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం టిడ్కో గృహ సముదాయాల్లో ఆయన పర్యటించారు. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు మహిళలు ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ టిడ్కో ఇళ్లలో నివ సించడానికి ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. గృహ సముదాయాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, గృహ సముదాయాల మధ్య ఉన్న ఖాళీ స్థలంలో పిచ్చి చెట్లు తొలగించి శుభ్రం చేయాలని చెప్పారు. తాగునీటినీ ఉదయం,సాయంత్రం విడుదల చేయాలని, నీటిని ఫిల్టర్ చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్కులు, కమ్యూనిటీ హాల్ లు వాడుకునే విధంగా తీర్చిదిద్దాలని, చిలకలూరిపేట ఆర్టీసీ డిపో నుంచి ఉదయం. సాయంత్రం రవా ణా సౌక ర్యం ఏర్పాటు చేయాలని కోరారు, ఆర్టీసీ డిపో నుండి బస్సు గృహాల వద్దకు రవాణా జరిగే వరకు, ప్రైవేట్ ఆటోల యూనియన్ సభ్యులతో మాట్లాడి ఎన్ఆర్టి సెంటర్ నుండి టిడ్కో గృహాల వరకు అధిక చార్జీలు వసూలు చేయ కుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మందు బాబులు ఆగడాలు పెరిగి పోయాయని, రాత్రి సమయాల్లో రక్షణ కల్పిం చేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని, యుద్ధ ప్రాతి పది కన ప్రైమరీ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు.

హెల్ప్ పౌండేషన్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-ముప్పాళ్ల

హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోస్థానిక మహిళా మండలి సమైక్య భవనంలో మహిళలు, బాలికలు తెలుసుకోవా ల్సిన చట్టాలపై సోమవారం అవగాహన కల్పించారు.కరపత్రాలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథి డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మి ప్రసాద్ మాట్లాడుతూ పిల్లలను బాల్య వివాహాలకు దూరంగా ఉంచి ఉన్నత చదు వులు చది వించాలని సూచించారు. అనంతరం మండల అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ బాలస్వామి,హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు మాట్లాడారు.

'జగనన్నకు చెబుదాం'కు 191 ఫిర్యాదులు

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

ప్రతి సోమవారం పల్నాడు జిల్లా నరసరావుపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్పందన హాల్లో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం ప్రజా ఫిర్యాదుల దినోత్సవం సందర్భంగా సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శివశంకర్, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్, రెవెన్యూ అధికారి వినాయకం తదితరులు పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 191 అర్జీలు వచ్చాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్జీదారులకు ఇం డియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంస్థ ఉచిత భోజన వసతి ఏర్పాటు చేశారు. జిల్లాలో చేనేత వస్త్రాలను ప్రోత్స హించడంలో భాగంగా జిల్లా అధికారులు అందరూ చేనేత వస్త్రాలు ధరించి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ 2016 పులిచింతల ప్రాజెక్టు గేట్లు ఎత్తివేసిన సందర్భంగా ఏర్పడిన వరదలలో చనిపోయిన జాను నాయక్ కుమారుడు సైదా నాయక్ కు అతని అర్హత మేరకు కారుణ్య నియామకం కింద ఔట్సోర్సింగ్ విధానంలో ఆఫీస్ సబార్డినేట్ నియామక ఉత్తర్వులను అందజేశారు. కార్యక్రమ అనంతరం 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా జిల్లాకు వచ్చిన క్రీడా కిట్ల అందజేత కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మూడు చక్రాల వాహనం కోసంవినతి



మూడు చక్రాల వాహనం మంజూరు చేసి తనకు సాయం చేయాలని నరసరావుపేట పట్టణ సమీపంలోని లింగంగుంటకు చెందిన వికలాంగుడు అప్పిశెట్టి రమేష్ విన్నవించు కున్నారు. ఈ మేరకు కలెక్టర్‌ను వేడుకున్నారు.

అధికారుల అండతో పొలం కబ్జా



తమకు వారసత్వంగా వచ్చిన 90 సెంట్ల పొలాన్ని రెవెన్యూ అధికారులు అండదండలతో బలుసుపాటి సైదులు స్వాధీనం చేసుకున్నారని, తమకు న్యాయం చేయాలని పిడుగురాళ్ల మండలం జూలకల్లుకి చెందిన వృద్ధ దంపతులు భీమవరపు వెంకటేశ్వర్లు, అతని భార్య విజ్ఞప్తి చేశారు. తమ దగ్గర ఉన్న ఆధారాలతో రెవెన్యూ అధి కారులను తాము కలిసినా, సైదులుకే వత్తాసు పలుకుతున్నారని పేర్కొన్నారు.

రుణమిస్తే దుకాణం ఏర్పాటు చేసుకుంటా



తాను సమాజంలో గౌరవంగా బతికేందుకు చిరు దుకాణం ఏర్పాటు చేసుకుంటానని, కార్పొరేషన్ ద్వారా తనకు రుణం మంజూరు చేసి సహకరించాలని నరసరావుపేట మండలం యలమందకు చెందిన వికలాంగురాలు రాయపూడి కోటమ్మ తన అర్జీలో కోరారు.

పొలం బాట దున్నేశారు



రికార్డు ప్రకారం ఏళ్ల తరబడి ఉన్న తన పొలానికి వెళ్లే బాటను దున్నివేసి తన పొలానికి బాట లేకుండా చేసిన సుంకేసుల జంగమయ్య, అతని కుటుంబ సభ్యులు ఆది రమేష్ గొట్టాల అంజి లపై చర్యలు తీసుకోవాలని మండల కేంద్రం కారంపూడికి చెందిన రాజుల నాగేశ్వరరావు అతని కుమారుడు నాగరాజు ఫిర్యాదు చేశారు. తన పొలానికి మార్గం యథావిధిగా చేయాలని కోరుతూ కారంపూడి తహశీల్దార్‌కు అన్ని ఆధారాలు, నివేదిక ఇచ్చినట్టు చెప్పారు. తమకు ఉన్న వ్యవసాయ భూమిని బాట లేకుండా చేసి బెదిరింపులకు పాల్పడ్డారని, అక్రమంగా తక్కువ ధరకు ఆ పొలాన్ని కాజేయాలని చూస్తున్న వారిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరారు.

జాలలపాలెం భూముల పై విచారణ జరపండి



వినుకొండ నియోజకవర్గంలోని జాలల పాలెం, బ్రాహ్మణ పల్లి గ్రామాలలో అన్యా క్రాంతమైన 175 ఎకరాల ప్రభుత్వ భూమిపై విచారణ జరిపి త్వరిత గతిన ప్రభుత్వం స్వాధీనం చేసు కోవాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉన్నారని జై భీమ్ భారత్ పార్టీ నియోజకవర్గ బాధ్యులు గోదా జాన్ పాల్ ఫిర్యాదు చేశారు. వినుకొండ ప్రాంతంలో సెంటు భూమిలేని నిరుపేదలు కొల్లలుగా ఉన్నా రని, వందల ఎకరాల భూములు ఉన్న భూబకాసురులు పేదలకు చెందాల్సిన ప్రభుత్వ భూములను ఆక్రమించుకోవడం దుర్మార్గమన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన జాయింట్ కలెక్టర్


ఎన్ఐఎ దాడులను ఖండిస్తున్నాం



రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రజా సంఘాల నాయ కులపై బిజెపి, ఆర్ఎస్ఎస్‌ల అనుబంధ సంస్థ ఎన్ఐఏ అక్రమంగా దాడులు చేయ డాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమ ఉద్యమ రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, అమ రుల బంధు మిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బొప్పూడి అంజమ్మ అన్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఉ.పా కింద అరెస్టు చేసిన ప్రజా సంఘాల నాయకులను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో పిడిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వై వెంకటేశ్వరరావు ,పిడిఎం నాయకులు జి రామకష్ణ, నల్లపాటి రామారావు, ఎం సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు అబ్రహం లింకన్, సిఐటియు నాయకులు షేక్ సిలార్ మసూద్, సిపిఐ నాయకులు కృష్ణ నాయక్ , జై భీమ్ భారత్ పార్టీ నరస రావు పేట నియోజకవర్గం బాధ్యులు గోదా జాన్ పాల్ ఉన్నారు.

'విశ్వకర్మ' దరఖాస్తులు సచివాలయంలో తీసుకోండి

విశ్వకర్మ సంక్షేమ పథకానికికి సంబంధించిన దరఖాస్తులు గ్రామ,వార్డు సచివాలయాల ద్వారా ఆన్లైన్ ద్వారా తీసుకోవడం లేదని , ఏపీ ఆన్లైన్ మీసేవ ద్వారా అప్లై చేయాలంటే డబ్బులు ఖర్చు అవుతున్నాయని పల్నాడు భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు , సిడబ్ల్యూఎఫ్ఐ) నాయకులు కలెక్టర్‌కు తెలిపారు. గ్రామ,వార్డు సచివాలయ ద్వారా విశ్వకర్మ పథకానికి ఆన్లైన్ చేసి తగు రసీదు, గుర్తింపు కార్డులు ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. భవన నిర్మాణ కార్మికులకు రావాల్సిన గుర్తింపు కార్డులు రావడం లేదని, సత్తెనపల్లి,వినుకొండ లేబర్ కార్యాలయాల పరిధిలో కంప్యూటర్లు,ప్రింటర్లు లేని కారణంగా వాటిని ఇవ్వడం లేదని తెలిపారు. గుర్తింపు కార్డు కోసం వెల్ఫేర్ బోర్డుకు



రూ.110 చెల్లించామని, కనీసం ఆన్లైన్ చేసి జిరాక్స్ కాగితం కూడా కార్మికులకు ఇవ్వడం లేదని తెలిపారు. ఈ సమస్యను కూడా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో పల్నాడు భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి మసూద్, ఉపాధ్యక్షులు సురేష్ ఉన్నారు.

దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

న్యాయవాదిపై దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ న్యాయవాదులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాది పై పోలీసుల దురుసు ప్రవర్తనకు నిరసనగా కోర్టు ఆవరణలో విధులను బహిష్కరించారు . ఈ సందర్భంగా బార్ అసోసి యేషన్ మాజీ అధ్యక్షులు జి.మార్క్‌రావు మాట్లాడుతూ న్యాయవాది కోట సాంబశివరావు ఓ కేసు నిమిత్తం అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా ఆయనపై ఎస్ఐ మణికృష్ణ, రైటర్ సత్యరాజ్ లు అనుచిత వ్యాఖ్యలతో దురుసుగా ప్రవర్తించారని అన్నారు. ఒక న్యాయవాదితోనే పోలీసులు ఈవిధంగా వ్యవహరిస్తే, ఇక సామాన్య ప్రజలతో వారు ఎలా వ్యవహరిస్తారో అర్థం చేసుకోవచ్చని అన్నారు. దురుసుగా ప్రవర్తించిన ఎస్ ఐ, రైటర్ లపై పోలీస్ ఉన్నతాధి కారులు చర్యలు తీసుకోవాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా పోలీస్ అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

బార్ అధ్యక్షులు ఎం .లింగారెడ్డి, న్యాయ వాదులు జె.విజయ్ కుమార్, ఎన్ వేణుగోపాల్ , జానీబాషా , సంగీతరావు పాల్గొన్నారు .

'పోలీసులపై వదంతులు అవాస్తవం'

ప్రజాశక్తి - అచ్చంపేట :

సత్తెనపల్లి న్యాయవాది కోట సాంబశివరావుపై అచ్చంపేట పోలీసులు అనుచిత వ్యాఖ్యలు చేశా రంటూ సోషల్ మీడియాలో వస్తున్న కథనాలు అవాస్త వమని పెద కూరపాడు సిఐ వీరస్వామి స్పష్టం చేశారు. సోమవారం అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల 20వ తేదీ ఉదయం తాళ్లూరి ఆశాజ్యోతి తన వ్యక్తిగత విషయమై పోలీస్ స్టేషన్‌కు వచ్చింది. ఇక్కడికి వచ్చే సమయంలో ఆమె షుగర్ మాత్రలు ఎక్కువగా తీసుకుంది.అదే సమయంలో ఆశా జ్యోతికి అన్న వరుస అయిన కోట సాంబశివరావు కూడా పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. పోలీస్‌స్టేషన్ వద్ద ఆమెపై సాంబశివరావు దాడి చేస్తుండగా అతన్ని డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ వై.సురేష్,స్టేషన్ రైటర్ సత్యంరాజు ప్రశ్నించారు. ఏమైనా ఉంటే ఎస్ఐతో మాట్లాడుకోవాలే తప్ప గొడవ చేయొద్దని చెప్పారు. ఆ తరువాత స్టేషన్‌లోకి వచ్చిన సాంబశివరావు 'మీరెవరు నాకు చెప్పడానికి, నా చెల్లెలు.. నా ఇష్టం వచ్చినట్లు చేసుకుంటాను' అని అరుస్తుండగా, ఎస్ఐ స్టేషన్‌లో నుంచి వచ్చి 'ఎందుకు అలాగొడవ చేస్తున్నారు' అని ప్రశ్నించారు. దీంతో, సాంబశివరావు అరుచు కుంటూ



మాట్లాడుతున్న పెదకూరపాడు సిఐ వీరస్వామి

అక్కడి నుండి వెళ్ళిపోయారని సిఐ చెప్పారు. అంతేగాని ఆ సమయంలో పోలీసులు ఎవరూ సాంబశివరావుపై దురుసుగా ప్రవర్తించడం, అవమానపరిచేలా మాట్లాడటం చేయలేదని చెప్పారు. సమావేశంలో అచ్చంపేట ఎస్సై మణికృష్ణ, క్రోసూరు ఎస్సై రవీంద్ర పాల్ ఉన్నారు.



జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలకు వెల్లలూరు జెడ్‌పి విద్యార్థులు

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

చిలకలూరిపేట ఎఎంజి పాఠశాలలో ఈ నెల 7వ తేదీన జరి గిన బాక్సింగ్ స్కూల్ గేమ్స్ డిస్టిక్ సెలక్షన్‌లో పొన్నూరు మండలం వెల్లలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయులు కె. రమేష్ తెలిపారు. పలు విభాగాలలో పోటీలు జరగగా.. 42 కేజీల విభాగంలో పి.మానస, 44 కేజీల విభాగంలో పి.కీర్తి, 50 కేజీల విభాగంలో ఎం.తరుణ్, 52 కేజీల విభాగంలో లాస్య, 54 కేజీల విభాగంలో కె.జీవిత, 56 కేజీల విభాగంలో పి.శిరీష, 70 కేజీల విభా గంలో శ్రావణిలు ప్రథమ స్థానంలో నిలిచారు. వీరు రాష్ట్ర స్థాయిలో జరిగే బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.ఎంపికైన విద్యార్థినీ విద్యార్థులను, పిడి దాసరి సరళాదేవిని ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు అభినందించారు.



కాన్షీరాంకు బిసి సంక్షేమ సంఘం నివాళి

ప్రజాశక్తి-గుంటూరు

కాన్షీరాం వర్ధంతి సం దర్భంగా స్థానిక ఏసీ కాలేజి వద్ద ఉన్న విగ్ర హానికి బిసి సంక్షేమ సంఘం నాయ కులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ దేశంలో బడుగు బలహీన వర్గాల ప్రజలను చట్టసభలలోకి నడిపించిన గొప్ప నాయకుడు కాన్షీ రాం అన్నారు. ఆయన స్ఫూర్తితో బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ప్రత్యా మ్నాయ రాజకీయం దిశగా అడుగులు వేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కులగణన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బహుజన ఫ్రంట్ రాష్ట్ర నాయకులు టి.నరసింహారావు, బిసి సంక్షేమ సంఘం కళా కారుల రాష్ట్ర నాయకులు ముప్పాన వెంకటేశ్వరరావు, విద్యార్థి విభాగం అధ్యక్షులు కొల్లికొండ వెంకట సుబ్రహ్మణ్యం, సమాజ్ వాదీ పార్టీ రాష్ట్ర నాయకులు పి.శ్రీనివాస రావు, బిసి సంక్షేమ సం ఘం యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.



పల్నాడు కవితోత్సవంలో 'ఆళ్ల'కు సత్కారం

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన కవి ఆళ్ళ నాగేశ్వరరావు పల్నాడు జిల్లా శాఖ పర్యవేక్షణలో శ్రీశ్రీ కళావేదిక సాహితీ సేవాసంస్థ నరసరావు పేటలో ఆదివారం నిర్వహించిన పల్నాడు కవితోత్సవంలో పాల్గొ న్నారు. జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో పాల్గొని 'నందనవం' శీర్షికన రచించిన తప కవితను ఆయన పఠించి ప్రశంసలందు కున్నారు. ఈ సందర్భంగా ఆళ్ళను కళారత్న,డాక్టర్ కట్టిమండ ప్రతాప్, సంస్థ జాతీయ మహిళా అధ్యక్షురాలు రమావతి, పల్నాడు జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు శాంతాభాయ్, జి.రాజేష్ సత్కరించినట్లు ఆళ్ళ సోమవారం తెలిపారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికుడి కుటుంబానికి పరిహారం

ప్రజాశక్తి-గుంటూరు

కార్మికుల కుటుంబాలకు జిఎంసి అండగా ఉం టుందని, కార్మికులకు అందాల్సిన పరిహారాలు వెంటనే అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ప్రజారోగ్య విభాగంలో అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఆగి పోగు అజయ్‌కుమార్ ఇటీవల అనారోగ్యంతో మర ణిం చారు. అజయ్‌కుమార్ భార్య సమాధానంకు కమిషనర్ సోమవారం రూ.2 లక్షల చెక్కును అందజేశారు. జిఎంసి నుండి రావాల్సిన ఇతర పరి హారాలు, పిఎఫ్ త్వరిత గతిన విడుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబం ధిత అధికారులను ఆదేశించామని కమిషనర్ తెలిపారు.



చెక్కు అందజేస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

కార్మికులు తమ సమస్యలపై ప్రతి గురువారం జరిగే కార్మికుల ప్రత్యేక గ్రీవెన్స్‌లో అర్జీలు అందించవచ్చని తెలిపారు.

'ఆరోగ్య సురక్ష'తో ప్రజలకు ఎంతో మేలు

ప్రజాశక్తి-తెనాలి

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పేద ప్రజ లకు ఎంతో ఉపయోగకరమని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు అన్నారు. స్థానిక పినపాడు ఉర్దూ పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. వైద్యులు, చికిత్స నిమిత్తం వచ్చిన స్థానికులతో ఆయన మాటా ్లడారు. అందుతున్న వైద్యసేవల గురించి కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లా మలేరియా అధికారి టి.మురళీకృష్ణ సుబ్బరాయణం మాట్లాడుతూ శిబిరంలో జనరల్ ఓపి 116, సర్జరీ ఓపి 52, ఫిజీషియన్ ఓపి 67, ఆప్తమాలజి ఓపి 108గా నమోదైనట్లు చెప్పారు. **మేడికొండూరు:** మండలంలోని జంగంగుంట్ల పాలెంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. పలువురు స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొని రోగులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 350 మంది జగనన్న ఆరోగ్య సురక్ష సేవలు పొందారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస శర్మ, మండల వైద్యాధికారి డాక్టర్ టి అనిరుద్, సర్పంచ్ కె.శ్రీదేవి సాంబిరెడ్డి పాల్గొన్నారు. **పొన్నూరు రూరల్:** వ ఆరోగ్య సురక్ష పథకం పేద ప్రజలకు భరోసా భరోసా



జంగంగుంట్లపాలెంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

వంటిదని మండల జెసిఎస్ కన్వీనర్, దండమూడి సర్పంచ్ భవనం వంశీ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభకు పొన్నూరు ఎం పీడీవో ఎ.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. 343 మంది రోగులకు షుగర్, ఈసీజీ, బిపి, గుండె జబ్బులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశా రు. కార్యక్రమంలో ఎంఇఒ శ్రీనివాసరెడ్డి, తహశీల్దారు శ్రీకాంత్ కేదరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలో వ్యవసాయరంగం

మాజీమంత్రి ఆలపాటి విమర్శ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో రైతుల సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికి వదిలివేసిందని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆరోపించారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు సకాలంలో విత్తనాలు అందివ్వడంలో ప్రభుత్వం విఫలం అయిందన్నారు. రైతులకు అవసరమైన సరుకు 10 శాతం కూడా ఆర్‌బికేల ద్వారా ఇవ్వడంలేదని తెలిపారు. ఆర్‌బికేల ద్వారా అంతా చేసేస్తునామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నష్టపోయిన పంటకు ఇన్సూరెన్స్ ఉండదు, పండిన పంటకు గిట్టుబాటు ధరలు లేవన్నారు. సబ్సిడీ మీద విత్తనాలు ఇస్తామంటూ ఉత్తుత్తి ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. రైతులు అకాల వర్షాలతో పంట దెబ్బతింటే నష్టపరిహారాన్ని సకాలంలో ఇవ్వలేని దుస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ పంటలకు ఎలాంటి అవకాశాలు రైతులకు కల్పించకుండా ఎలా రైతు కుటుంబాలు బ్రతుకుతాయని ప్రశ్నించారు. రైతులకు కేంద్రం నుంచి వచ్చే పథకాలను కూడా చివరకు అందకుండా చేస్తున్న దుస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. రైతులు అకాల వర్షాలతో పంటలు దెబ్బతిని ఆత్మహత్యలకు పాల్పడు తుంటే చోద్యం చూస్తూ కూర్చోవడం ఏమిటని విమ ర్శలు గుప్పించారురైతుల గురించి ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించడం వ్యవస్థలను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుం దన్నారు. నీటి పారుదల రంగంపై ఏమాత్రం అవగాహన లేకుండా వ్యవహరిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ దారులతో సమీక్షలు లేవు, తగురీతిలో పోరాటాలు చేయలేని స్థితిలో మంత్రులు లేకపోవడం దారుణం అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తో విద్యుత్ మిగులు బకాయిలు గురించి అడగలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. సమావేశంలో చిట్టాబత్తిన చిట్టిబాబు, నాయుడు ఓంకార్ పాల్గొన్నారు.

అండగా నిలిచి.. చేయూత



ప్రజాశక్తి - తాడేపల్లి

రోడ్డు ప్రమాదంలో మరణించిన తమ స్నేహితుడి కుటుంబానికి పెనుమాక వందేమాతరం జడ్పీ హైస్కూల్ 2007-08 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు అండగా నిలిచారు. 2007-08 పెనుమాక వందేమాతరం జడ్పీ హైస్కూల్ బ్యాచ్ కు చెందిన షేక్ ఖాసిం అనే విద్యార్థి గత ఆరు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలోమృతి చెందాడు. స్నేహితుని కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని తెలుసుకున్న ఆ బ్యాచ్ విద్యార్థులు వాట్సాప్ గ్రూప్ ద్వారా ఒకరికొకరు సమాచారాన్ని చేర వేసుకున్నారు.మొత్తం రూ.65 వేల నగదును సేకరించి ఆదివారం పెనుమాకులోని ఖాసిం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఏ ఇబ్బంది వచ్చినా తమను సంప్రదించాలని ఖాసిం తల్లిదండ్రులకు చెప్పి వారిలో ధైర్యాన్ని నింపారు. సాయపడ్డ బ్యాచ్ విద్యార్థులను పలువురు అభినందిస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-పెదకాకాని రూరల్

పెదకాకాని, వెనిగండ్లలో మంగళవారం విద్యుత్ సం ఫరాకు అంతరాయం కలుగుతుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిహెచ్ ఖాన్ తెలిపారని పెదకాకాని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.శ్రీనివాసరావు తెలియజేశారు. 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో నూతన నియంత్రికలు ఏర్పాటు చేసినందున మంగళవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఏర్పడు తుందని, గ్రామస్తులు సహకరించాలని కోరారు.



చిరు వ్యాపారులకు బండ్లు పంపిణీ

ప్రజాశక్తి-మంగళగిరి

స్థానిక 23వ వార్డుకు చెందిన కె.మార్తమ్మ, 28 వార్డు చెందిన ఎస్.జానీ లకు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో సోమవారం టిఫిన్ బండి, రిక్షా బండిని అందజేశారు. తకార్యక్రమంలో టిడిపి నాయకులు డి.రాజు, జి.దుర్గారావు, షేక్ రియాజ్, ఎన్.మోహన్, డి.సత్యానందం పాల్గొన్నారు.

అక్కినేని నాగేశ్వరరావుకు 'భారతరత్న' ఇవ్వండి

ప్రజాశక్తి-పెదకాకాని రూరల్

ఏడు దశాబ్దాల పాటు తెలుగు చలనచిత్ర పరిశ్రమల్లో నటుడిగా కొనసాగిన నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు సినీ రంగానికే వన్నె తెచ్చారని కవి, రచయిత తాతినేని తులసి మోహన్ సోమవారం పేర్కొ న్నారు. అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి ఉత్సవాలను సినీ సాంస్కృతిక కళా రంగ సంస్థలు వైభవోపేతంగా నిర్వహించాలన్నారు. పద్మ విభూషణ్, దాదా సాహెబ్ ఫాల్కే లాంటి అరుదైన అవార్డులను అందుకున్న అక్కినేనికి కేంద్ర ప్రభుత్వ అత్యున్నత పురస్కారం భారతరత్న ఇవ్వాలని కోరారు.



ఇస్త్రీ బండ్లు అందజేస్తున్న వైసిపి నాయకులు

ఇస్త్రీ బండ్లు అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని మహానాడుకు చెందిన రాజమండ్రి శ్రీనివాస్, ఇ.సోములుకు వైసిపి నాయకులు సోమవారం ఇస్త్రీబండ్లు అందజేశారు. సరిగ్గా పని లేక సొంత బండ్లు లేక ఇబ్బంది పడుతున్న నేపథ్యాన్ని బాధితులు వైసిపి నేతల దృష్టికి తీసుకెళ్లారు. పట్టణ అధ్యక్షులు వేణుగోపాలసోమిరెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి వారికి బండ్లు వచ్చే విధంగా కృషి చేశారు. కార్యక్రమంలో ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి సిహెచ్.దుర్గారావు, సచివాలయ కన్వీనర్లు పి.ఈశ్వరి, సయ్యద్ సలాం, బి.రామకృష్ణ, పి.శ్రీనివాసరావు, ఎండి బాజీ, మోహనసాయి తదితరులు పాల్గొన్నారు.

11న సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-కాకుమాను

ఈ నెల 11న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగు తుందని మండల అభివృద్ధి శాఖాధికారి పి.రామ కృష్ణ తెలిపారు. బుధవారం సాయంత్రం రెండు గంటలకు జరగనున్న ఈ సమావేశానికి మండల పరిషత్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

12న పాఠశాల విద్యార్థులకు రోల్‌ప్లే, ఫోక్‌డ్యాన్స్ పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో చదువుతున్న 8, 9వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు జిల్లా స్థాయిలో రోల్‌ప్లే, ఫోక్ డ్యాన్స్ పోటీలు ఈనెల 12న ఉదయం 10 గంటలకు బోపాలెంలోని జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్)లో నిర్వహిస్తున్నట్లు గుంటూరు డిఇఒ పి.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపించటం జరుగుతుందన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులతోపాటు ఆయా పాఠశాలల నుండి ఒక ఉపాధ్యాయుడు కూడా హాజరు కావాల్సి ఉంటుందని, భోజన సదుపాయం ఉంటుందన్నారు. ఇతర వివరాలకు డైట్ లెక్చరర్ పి.పోలేరు(9704790917)ను సంప్రదించాలని సూచించారు.

డిగ్రీ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ కోర్సులకు నిర్వహించిన నాలుగవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సోమవారం వీసి ప్రొఫెసర్ పి. రాజశేఖర్ విడుదల చేశారు. యూజీ కోర్సులకు సంబంధించి బిఏ, బీకాం, బీఎస్సీ, బిబిఏ వంటి అన్ని కోర్సుల ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలకు సంబంధించి 61 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఎసి ఇ రెడ్డి ప్రకాష్ రావు తెలిపారు. రీవాల్యుయేషన్‌కు ఈనెల 24వ తేదీలోగా ఒక్కో పేపర్‌కు రూ.1240 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని, పర్సనల్ వెరిఫికేషన్, జవాబు పత్రాల జిరాక్స్ కాపీలకు రూ.1700 చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ పి .వరప్రసాద్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ, డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సంధ్య కోల్, పీజీ పరీక్షల కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఉదయ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డాన్స్, మ్యూజిక్ కోర్సులకు విశేష స్పందన

పలు నూతన విభాగాలను ప్రారంభించిన విసి

ప్రజాశక్తి - ఎఎన్‌యు



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఎం ఎ డాన్స్ , మ్యూజిక్ కోర్సులకు అనూహ్య స్పందన లభించిందని విభాగం అధిపతి డాక్టర్ జి అనిత తెలిపారు ఈ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డాక్టర్ అనిత తెలిపారు. విద్యార్థులు డాన్స్, మ్యూజిక్, థియేటర్ ఆర్ట్స్ కోర్సులలో ఆసక్తి ఉంటే తమ దరఖాస్తులు చేసుకునే వీలును కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కోర్సులను సోమవారం వీసి ప్రొఫెసర్ పి .రాజశేఖర్ లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం వర్సిటీలో పలు నూతన కోర్సులు విభా గాలను ప్రారంభించారు. ఎంబీఏ టెక్నాలజీ మేనేజ్మెంట్, ఎంబీఏ మీడియా మేనేజ్మెంట్, ఎంఎస్సీ డేటా సైన్స్, ఎంఎస్సీ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కోర్సులు ఉండగా ఎంఏ అప్లైడ్ లింగ్విస్టిక్స్ అండ్ ట్రాన్స్లేషన్ స్టడీస్ కోర్సులను కూడా వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభిరుచికి తగ్గట్లు కొత్త కొత్త కోర్సులను ఏర్పాటు చేసి ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా విశ్వవిద్యా లయం ముందు వెళ్తుందని, నూతన కోర్సులలో ఫ్యాకల్టీ నియామకం, మౌలిక సదుపాయాలు కల్పన పూర్తి చేసినట్లు వీసి తెలిపారు. ఆయా విభాగాల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో రెక్టార్ ప్రొఫెసర్ పి. వరప్రసాద్ మూర్తి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరణ , ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సిహెచ్. స్వరూపరాణి, ఆయా విభాగాధిపతులు, కోర్సులకు ఆర్డినేటర్లు, ఇంజనీర్ కుమార్ రాజా, వికాస ఉద్యోగ సంఘం అధ్యక్ష కార్యదర్శులు టి. అనిల్ కుమార్, కావూరి శ్రీనివాసరావు ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది తదితరులుపాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కళాధర్

ఉపాధ్యాయుల జీతాల పట్ల నిర్లక్ష్యం తగదు : యుటిఎఫ్

ప్రజాశక్తి-గుంటూరు

ఉపాధ్యాయులకు పదో తేదీ వచ్చినా జీతాలు విడుదల చేయకపోవటం శోచనీయమని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యం.కళాధర్ అన్నారు. సోమవారం స్థానిక బ్రాడీపేటలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయనమ ఆట్లాడారు. ప్రతి నెలా ఉపాధ్యాయుల జీతాల చెల్లింపులో నిర్లక్ష్యం వహిచటం తగదన్నారు. గత నాలుగు నెలలుగా కొందరికి, రెండు నెలలుగా కొందరికి జీతాలు లేవని చెప్పారు. నెలల తరబడి జీతాలు లేకపోవటంతో ఉపాధ్యాయులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల విభాగం చైర్మన్ యం.హనుమంత రావు మాట్లాడుతూ జీతాలు ఎప్పుడు వస్తాయో కూడా తెలియని పరిస్థితి నెలకొదని, ప్రతి నెలా క్రమం తప్పకుండా వస్తాయన్న నమ్మకం పోయిందన్నారు. అదే విధంగా ఉద్యోగుల మెడికల్ బిల్లులు, ఇతర లోన్లు చెల్లింపు నిలుపుదల చేయటం తగదని అన్నారు. తక్షణమే ఉద్యోగుల జీతాలు, ఇతర లోన్లు చెల్లించాలని, లేనిపక్షంలో పోరాటం తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, ఏ.ఎల్.శివపార్వతి, జిల్లా కార్యదర్శులు ఆదినారాయణ, జి.వెంక

ఎపి సేవ పోర్టల్‌లో వెయ్యికి పైగా రిక్వెస్ట్‌లు పెండింగ్

పరిష్కరించాలని అధికారులకు జెసి ఆదేశాలు

గుంటూరు స్పందనలో 248 అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు



అర్జీలు స్వీకరిస్తున్న జెసి రాజకుమారి, తదితరులు

జిల్లా నలుమూలల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కా రానికై స్పందన కార్యక్ర మంలో అందించే పిటీషన్లు పరిశీలించి సత్వరమే హేతుబద్ధంగా పరిష్కరించాలని జిల్లా అధికారులను జిల్లా సంయుక్త కలెక్టర్ జి. రాజ కుమారి ఆదేశించారు. సోమవారం కలక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో జెసి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు లలిత, వెంకట శివరామిరెడ్డి, గుంటూరు ఆర్‌డీఓ ప్రభాకరా ఒడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కె.స్వాతి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 248 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి రాజకుమారి మాట్లాడారు. పరిష్కరించిన ఫిర్యాదులు తిరిగి రీఓపెన్ కాకుండా అధి కారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఏపి సేవ పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న వెయ్యికి పైగా రిక్వెస్ట్‌లను పరిష్కరించాలన్నారు. ఫిర్యాదు లను శాఖల వారీగా వివరాలు ఎప్పటి కప్పుడు ముందస్తుగా తెలియజేస్తున్న ప్పటికీ అధికారులు సకాలంలో స్పందించ కపోవడం వల్ల బియాండ్ ఎస్ఎస్ఎలోకి వెళు తున్నా యన్నారు. మరో 49 గంటల్లో బియాండ్ ఎస్ఎల్ఎలోకి వెళ్లే 52 అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమం లో డీఆర్డీఏ, డ్వామా, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్లు హరిహర నాథ్, యుగంధర్ కుమార్, వేణుగోపాల్, జెడ్పీ సిఈఓ జె.మోహన్ రావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వసతిదీవెన, విద్యాదీవెన రాలేదని బయటకు గెంటేశారు



ప్రభుత్వం నుండి విద్యాదీవెన, వసతి దీవెన విడుదల కాలేదని తమను, హాస్టల్ నుండి బయటకు గెంటేశారని, తమకు న్యాయం చేయాలని పొన్నూరులోని వివిఆర్ ఇంజినీరింగ్ కాలేజిలో డిప్లొమా విద్యార్థులు స్పందనలో అర్జీ అందచేశారు. సుమారు 40 మంది వివిధ జిల్లాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బిసి తదితర విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లిస్తే సరిపోతుందని, మిగిలినవి మేము భరిస్తామని కాలేజి యాజమాన్యం ఇచ్చిన భరోసాతో కాలేజిలో చేరామన్నారు. అయితే 2021-22, 2022-23 సంవత్సరాల్లో వసతి దీవెన విడుదల కాకపోవటంతో ఆ ఫీజులు సొంతగా భరించాలని యాజమాన్యం చెబుతుందని, అప్పటి దాకా భోజనం కూడా పెట్టమని బయటకు పంపించారన్నారు. కాలేజి, హాస్టల్ ఫీజులు కట్టకుండా పరీక్ష ఫీజు కూడా కట్టించుకోమని, హాల్‌టిక్కెట్స్ ఇవ్వమని బెదిరిస్తున్నారన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు.



నెల రోజులుగా డ్వాక్రా రుణాల కోసం తిప్పలు

రుణాలు మంజూరైనప్పటికీ యానిమేటర్ల మార్పు వల్ల నెల రోజులు రుణాలు విడుదల కావట్లేదని స్థానిక జన్మభూమి నగర్‌కు చెందిన డ్వాక్రా మహిళలు అర్జీ అందచేశారు. తమ గ్రూపునకు నల్లపాడు ఐఒబి బ్యాంకులో నెల రోజుల క్రితం రుణం మంజూరు అయ్యిందని, అయితే యానిమేటర్ ధృవీకరణ అవసరం అవుతుందన్నారు. అయితే కొత్తగా వచ్చిన యానిమేటర్ల వివరాలు అప్‌డేట్ కాకపోవటంతో వారు సంతకం చేసినా రుణాలు మంజూరు కావట్లేదన్నారు. దీనిపై అధికారుల్ని సంప్రదిస్తే అదిగో, ఇదిగో అంటూ తిప్పుతున్నారన్నారు. కావున తమకు త్వరిత గతిన రుణాలు విడుదల అయ్యేలా చూడాలని కోరారు.



108 సిబ్బందిని ప్రభుత్వ

కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలి

108 సర్వీసులలో పనిచేస్తున్న ఇఎంటి, పైలెట్‌లను వైద్య ఆరోగ్య శాఖలో ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ 108 అంబులెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు స్పందనలో అర్జీ అందచేశారు. గత 18 సంవత్సరాలుగా ఈ విభాగంలో పనిచేస్తూ ప్రతి రోజూ 12 గంటల విధులు నిర్వహిసు న్నామని, ప్రజలకు అత్యవసర వైద్యసేవలు అందించటంలో కీలకభూమిక పోషిస్తున్నామని చెప్పారు. ప్రతి సారి సర్వీసు ప్రొవైడర్లు మారిన ప్పుడల్లా ఉద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతు ఒదన్నారు. కావున తమ ఉద్యోగాలకు భద్రత కల్పిస్తూ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. అర్జీ ఇచ్చిన వారిలో వై.శివశంకర్‌రావు, ఎస్.కె.బాబు పాల్గొన్నారు.



నకిలీ విత్తనాలతో నష్టపోయాం

వరిలో నకిలీ సీడ్‌తో నష్ట పోయామని, తమకు న్యాయం చేయాలని వట్టి చెరుకూరు మండలం, సౌపాడుకు చెందిన రైతులు స్పందనలో అర్జీ అందచేశారు. గ్రామం లో వంద ఎకరాల్లో నంద్యాలకు చెందిన శ్రీనందిని విత్తనాలను గత అనేక సంవత్స రాలుగా ఉపయోగిస్తున్నామని, అయితే ఈ ఏడాది వేసిన వరిలో 40 శాతం కేళీలు వచ్చాయ న్నారు. దీనిపై సదరు కంపెనీని సంప్రదిస్తే మొదట్లో వచ్చి పరిశీలిస్తామని చెప్పారని, తర్వాత స్పందించట్లేదన్నారు. కావున తమకు న్యాయం చేయాలని, కంపెనీపై చర్యలు తీసుకొని రైతులకు పరిహారం ఇప్పించాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో కె.శ్రీనివాసరెడ్డి, పి.వసంతరెడ్డి ఉన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

జిఎంసి స్పందనకు 55 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజల నుండి అందే ఫిర్యాదులు, అర్జీలు రీ ఓపెన్ అయితే సంబంధిత విభాగాదిపతులే స్వయంగా పరిశీలించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత గత వారం స్పందనలో అందిన ఆర్జీల పరిష్కారంపై సమీక్షించి, అధికారులకు తగు సూచనలు చేశారు. అనంతరం కమిషనర్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో మొత్తం 55 ఫిర్యాదులు అందాయి. వాటిల్లో పట్టణ ప్రణాళిక విభాగం 12, ఇంజినీరింగ్ విభాగం 19, రెవెన్యూ విభాగం 8, ప్రజారోగ్య విభాగం 12, ఉపా సెల్ విభాగం సంబంధించి 4 ఫిర్యాదులు అందాయని, ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, ఎస్.ఈ. భాస్కర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరిండెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ స్పందనకు 13 అర్జీలు

ప్రజాశక్తి-తెనాలి

డివిజన్ ప్రజల సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిశీలించేందుకు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో 13 అర్జీలు దాఖలయ్యాయని సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ చెప్పారు. వాటిలో రెవిన్యూ శాఖకు సంబందించి ఆరు. పురపాలక సంఘానికి సంబందించి 4, పోలీసు శాఖకు సంబందించి రెండు, పంచాయ తీరాజ్‌కు సంబంధి ంచి ఒక అర్జీ దాఖలైనట్లు చెప్పారు. అర్జీలను సంబందిత శాఖలకు పంపి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్